



RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక

**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్): & చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.

సంచిక : 309 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | సోమవారం | 23-02-2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00

## గోదావరి జలాలపై చర్చకు సిద్ధం

**దేవాదుల భూసేకరణకు రూ.600 కోట్లు**

- మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీలను గాలికొదలం
- రాష్ట్రంపై రూ.8.11 లక్షల కోట్ల అప్పుల భారం
- చాలా గొప్పగా మేడారం నిర్వహణ : సీఎం రేవంత్‌రెడ్డి



నెలలోపు దేవాదుల పంపుల మరమ్మతులను పూర్తి చేయాలి

వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి / ములుగు

దేవాదుల ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణకు రూ.600 కోట్లను కేటాయించనున్నట్టు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం వద్దనున్న దేవాదుల ప్రాజెక్టు ఇన్‌టేక్‌వెల్‌ను సీఎం సందర్శించారు. అనంతరం ప్రాజెక్టు అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భూసేకరణ జాప్యంతో ప్రాజెక్టులు ఆపడానికి వీలులేదన్నారు. అన్ని ప్రాజెక్టుల భూసేకరణకు ప్రత్యేక కార్పస్ ఫండ్‌ను ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. దేవాదుల ప్రాజెక్టు భూసేకరణకు సంబంధించి అన్ని అంచనాలను ప్రభుత్వం ముందుకు బడ్జెట్ సమావేశాలకు ముందే తీసుకురావాలని అధికారులను ఆదేశించినట్టు చెప్పారు.

-మిగతా 2 లో

## టీమిండియా ఘోర ఓటమి

- 76 పరుగులతోదక్షిణాఫ్రికా గెలుపు
- దక్షిణాఫ్రికా 187/7, భారత్ 111/10

అహ్మదాబాద్

డిఫెండింగ్ ఛాంపియన్ చతికిల పడింది. సూపర్8 పోరులో దక్షిణాఫ్రికాకు కనీస పోటీ ఇవ్వలేదు. 188 పరుగుల ఛేదనలో భారత బ్యాటర్లు సమిష్టిగా విఫలమయ్యారు. శివం దూబె (42, 37 బంతుల్లో 1 ఫోర్, 3 సిక్స్‌లు) మినహా అందరూ నిరాశపరిచారు. ఇషాన్ కిషన్ (0), తిలక్ వర్మ (1), అభిషేక్ శర్మ (15) పవర్‌ప్లేలోనే నిష్క్రమించగా.. మిడిల్ ఓవర్లలో సూర్యకుమార్ యాదవ్ (18), వాషింగ్టన్ సుందర్ (11), హార్దిక్ పాండ్య (18), రింకు సింగ్ (0)ను కట్టడి చేసిన దక్షిణాఫ్రికా 76 పరుగుల తేడాతో ఏకపక్ష విజయం సాధించింది.

-మిగతా 2 లో





## ఏమిటీ 'నగ్న' రాజకీయం!

- ఇప్పటికే నిస్సిగ్గుగా ఉన్నారు..
- ఇంకా చొక్కాలు విప్పడమెందుకో?
- ఏఐ సదస్సు వద్ద కాంగ్రెస్ కార్యకర్తల తీరుపై మీరట్ సభలో మోదీ ధ్వజం

మీరట్,

దేశ రాజధానిలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన ఇండియా కృత్రిమ మేధ (ఏఐ) ఇంపాక్ట్ సదస్సు విజయవంతం కావడం కాంగ్రెస్ సహించలేకపోతోందని ప్రధాని మోదీ అన్నారు. యువజన కాంగ్రెస్ కార్యకర్తలు కొందరు ఆ సదస్సు వద్ద చొక్కాలు విప్పి హల్‌చల్ చేయడంపై మండిపడ్డారు. కాంగ్రెస్ మురికి, నగ్న రాజకీయాలు చేస్తోందని ధ్వజమెత్తారు. ఇప్పటికే ఆ పార్టీ నిస్సిగ్గుగా మారిందని.. ఇంకా చొక్కాలు విప్పాల్సిన అవసరం ఏముందని ఎద్దేవాచేశారు. ఆదివారం ఆయన యూపీలోని మీరట్‌లో నమో భారత్ రైలును, విస్తరించిన మెట్రో రైలును, రూ.12,930 కోట్లతో పూర్తిచేసిన పలు అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో కాంగట?స్రపై విరుచుకుపడ్డారు. 'ఏఐ సదస్సు వద్ద కాంగ్రెస్ నిరసన.. ఆ పురాతన పార్టీ సైద్ధాంతిక దివాలాకోరుతనానికి, పతనానికి నిదర్శనం. సొంత దేశాన్నే అప్రతిష్ఠ పాల్జేస్తోంది. కాంగ్రెస్ నేతలు నన్ను ద్వేషిస్తున్నారు.

-మిగతా 2 లో

## సర్ దెబ్బకు 1.70 కోట్ల ఓట్ల తొలగింపు

- తొమ్మిది రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఈసీ చర్య
- జాబితాను ప్రకటించిన కేంద్ర ఎన్నికల సంఘం




న్యూఢిల్లీ

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) అనంతరం తొమ్మిది రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో 1.70 కోట్లకుపైగా ఓటర్లను ఈసీ తొలగించింది. గతేడాది అక్టోబరులో సర్ ప్రక్రియ ప్రారంభానికి మునుపు ఆయా రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో 21.45 కోట్ల మంది ఓటర్లున్నారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ అనంతరం ప్రచురించిన తుది జాబితాలో ఓటర్ల సంఖ్య 19.75 కోట్లకు తగ్గింది. అంటే 7.93శాతం తగ్గుదల నమోదైంది. గుజరాత్, రాజస్తాన్, చత్తీస్‌గఢ్, గోవా, కేరళ, పుదుచ్చేరి, లక్ష్యద్వీప్, అండమాన్ అండ్ నికోబార్ ఐలాండ్స్‌కు చెందిన తుది ఓటరు జాబితాలను ఈసీ గతవారం విడుదల చేసింది. వాటిని విశ్లేషించగా ఈ గణాంకాలు బయటపడ్డాయి.


-మిగతా 2 లో

## 'వందేమాతరం సైక్లోథాన్' భేష్

- తీర ప్రాంత పరిరక్షణ బాధ్యతను చాటిన
- సీఐఎస్‌ఎఫ్ 6,553 కి.మీ. జాతీయ యాత్ర: బండి సంజయ్

హైదరాబాద్,

'వందేమాతరం కోస్టల్ సైక్లోథాన్-2026' పేరిట సీఐఎస్‌ఎఫ్ నిర్వహించిన జాతీయ సైకిల్ యాత్ర అత్యంత శ్రమతో కూడుకున్నదని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. అనేక కష్టాలు, అవాంతరాలను ఎదుర్కొంటూ సీఐఎసఎఫ్ బృందాలు 6,553 కి.మీ. మేర సైక్లోథాన్‌ను దిగ్విజయంగా ముగించడం ప్రశంసనీయమని చెప్పారు.



-మిగతా 2 లో

## దేవ్‌జీ లొంగుబాటు!

- మావోయిస్టు అగ్రనేతతో పాటు మల్లా రాజిరెడ్డి సహా 25 మంది కూడా..
- తెలంగాణ పోలీసులకు లొంగిపోయారు
- ఛత్తీస్‌గఢ్ డిప్యూటీ సీఎం వెల్లడి
- నేడో, రేపో రాష్ట్ర పోలీసుల ప్రకటన
- సీఎం రేవంత్ సమక్షంలో లొంగుబాటును చూపే అవకాశం



హైదరాబాద్/కోరుట్ల/మంథని,

మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ, కేంద్ర కమిటీ సభ్యుడు మల్లా రాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్ తెలంగాణ పోలీసుల ఎదుట లొంగిపోయారు. రాష్ట్ర కమిటీ సభ్యుడైన నర్సింహారెడ్డితో పాటు మొత్తం 25 మంది ప్రత్యేక ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబీ) పోలీసుల ఎదుట లొంగిపోయారు. ఈ లొంగుబాటును

-మిగతా 2 లో



## అఫ్గానిస్థాన్‌లో పాక్ వైమానిక దాడులు

- తెహ్రీక్ ఏ తాలిబాన్, ఐఎస్ స్థావరాలపై బాంబులు
- 70 మంది ఉగ్రవాదుల హతం: పాక్
- ప్రతీకారం తప్పదు: తాలిబాన్

ఇస్లామాబాద్/కాబూల్, ఫిబ్రవరి 22:

అఫ్గానిస్థాన్‌పై పాకిస్థాన్ మరోసారి వైమానిక దాడులు చేసింది. శనివారం అర్ధరాత్రి అఫ్గానిస్థాన్‌లోని నంగర్‌హర్, పక్తిక ప్రావిన్సుల్లో తెహ్రీక్ ఏ తాలిబాన్ పాకిస్థాన్(టీటీపీ), ఇస్లామిక్ స్టేట్- ఖొరాసన్ ప్రావిన్స్ ఉగ్రవాద సంస్థల స్థావరాలే లక్ష్యంగా ఏడు చోట్ల దాడులు చేసినట్లు పాకిస్థాన్ సైన్యం ఆదివారం ప్రకటించింది. ఇటీవల తమ దేశంలోని ఇస్లామాబాద్, బజౌర్, బన్నులలో జరిగిన ఆత్మాహుతి దాడులకు సూత్రధారులైన టీటీపీ, ఐఎ?సకేపీ నేతలను మట్టుబెట్టేందుకు లక్షిత దాడులు చేసినట్లు వెల్లడించింది. ఈ దాడుల్లో 70 మంది ఉగ్రవాదులు మరణించినట్లు పాక్ మంత్రి తలాల్ చౌధరి తెలిపారు. అఫ్గానిస్థాన్ ఉగ్రవాదులకు అడ్డాగా మారిందని ఆరోపించారు. అయితే, పాక్ దాడుల్లో సాధారణ పౌరులే మరణించారని అఫ్గానిస్థాన్ ప్రభుత్వం ఆరోపించింది. నంగర్‌హర్ ప్రావిన్సులోని బిహ్సుద్ జిల్లా గిర్దికాస్ గ్రామంలో పాక్ వైమానిక దళం జరిపిన దాడిలో ఒకే కుటుంబానికి చెందిన 18 మంది మరణించారు. తన కుటుంబంలోని 23 మందిలో

-మిగతా 2 లో

## ఏఐసీసీకి ఏటీఎంలా తెలంగాణ రేవంత్

**ఆత్మగౌరవాన్ని ఢిల్లీలో తాకట్టుపెట్టిన సీఎం**

- హామీల అమలకు నిధుల్లేవని కుంటిసాకులు
- 3 లక్షల కోట్లు అప్పుతెచ్చి.. ఒక్క ఇటుకైనా పేర్చావా?
- ఎక్స్ ద్వారా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజం

హైదరాబాద్,

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ తెలంగాణను ఏఐసీసీకి ఏటీఎంలా మార్చారని బీఆర్ఎస్ వరింగ్ ప్రెసిడెం ట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. రెండేండ్లుగా తాము అనేకసార్లు ఈ విషయంపై హెచ్చరించామని, ఇప్పుడు రేవంత్‌రెడ్డే నిస్సిగ్గుగా ఒప్పుకున్నారని ఎక్స్ వేదికగా కేటీఆర్ పేర్కొన్నారు. రాష్ట్ర సంపదను కాం గ్రెస్ అధిష్ఠానానికి ధారపోస్తూ, తెలంగా ణ ఆత్మగౌరవాన్ని ఢిల్లీ వీధుల్లో తాకట్టు పెడుతున్నారని మండిపడ్డారు. ప్రస్తుత పాలనను దండుపాళ్యం ముఠా తీరుతో పోల్చిన కేటీఆర్.. తెలంగాణను దోచుకోవడం, సొంతానికి దాచుకోవడం..తన పదవిని కాపాడుకోవడం కోసం ఢిల్లీకి సంచులు మోయడమే సీఎం రేవంత్‌ఏకై క



-మిగతా 2 లో



## పోస్టల్ సేవలు వెలకట్టలేనివి

- గుంటూరులో గ్రామీణ డాక్ సేవక్ సమ్మేళనంలో సిఎం
- ఉద్యోగులకు త్వరలో ఎలక్ట్రిక్ స్కూటర్లు
- కేంద్ర కమ్యూనికేషన్ల మంత్రి జ్యోతిరాదిత్య సింధియా

గుంటూరు జిల్లా ప్రతినిధి

తపాలా ఉద్యోగుల సేవలు వెలకట్టలేనివని, దేశంలో సాంకేతికత పెరిగినా వారి సేవలు కొనసాగుతున్నాయని, వీరిలో ఉన్న మానవత్వం వల్ల ఇప్పటికీ తగిన గుర్తింపు ఉందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. గుంటూరులో ఆదివారం డాక్ సేవక్ రాష్ట్ర సమ్మేళన్ (పోస్టుమాస్టర్స్) జరిగింది. రాష్ట్రం నలుమూలల నుంచి గ్రామీణ పోస్టు మాస్టర్లు హాజరయ్యారు. కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియాతో కలిసి సిఎం చంద్రబాబు నాయుడు, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పాల్గొన్నారు. ఉత్తమ డాక్ సేవక్‌లను అవార్డులతో సత్కరించారు. వీరికి ప్రత్యేకంగా రూపొందించిన డ్రస్ కోడ్, బ్యాగ్, టోపీ, ఇతర కానుకలతో

-మిగతా 2 లో

## సర్ దెబ్బకు 1.70 కోట్ల ఓట్ల తొలగింపు

మొదటి తరువాయి

ఓటరు జాబితాల నుంచి అనర్హులను తొలగించాలన్న లక్ష్యంతో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు ఈసీ శ్రీకారం చుట్టింది. తొలుత బీహార్‌లో ఈ ప్రక్రియను చేపట్టింది. ప్రస్తుతం 12 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో సర్ కొనసాగుతోంది.

**ఇప్పటి వరకు 2.16 కోట్ల ఓట్ల తొలగింపు**

అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీహార్‌లో సర్ ప్రక్రియ తర్వాత విడుదల చేసిన గణాంకాలను కూడా కలుపుకుంటే మొత్తం తొలగింపుల సంఖ్య 2.16 కోట్లకు చేరాయి. అంటే 7.37 శాతం మంది ఓటర్లను తొలగించారు. బీహార్‌లో 2025 జూన్‌లో 7.89 కోట్ల ఓటర్లున్నారు. సెప్టెంబర్ 2025లో నాటికి ఈ సంఖ్య 7.43 కోట్లకు తగ్గింది.

## ఏమిటీ 'నగ్న' రాజకీయం!

మొదటి తరువాయి



నాకు సమాధి తవ్వాలనుకుంటున్నారు. చివరకు నా తల్లిని అవమానించేందుకూ వెనుకాడడం లేదు. కానీ, ఏఐ సదస్సు బీజేపీ కార్యక్రమం కాదని వారు గుర్తుంచుకోవలసింది. ఇది జాతీయ కార్యక్రమం. కాంగ్రెస్ సభ్యత మరచి వ్యవహరించింది. అన్ని హద్దులూ దాటేసింది. వారి ప్రవర్తనను దేశం మొత్తం తీవ్రంగా ఖండిస్తోంది. ఈ ఘటనకు సిగ్గుపడాల్సింది పోయి.. దేశాన్ని అవమానించినవారిని హీరోలుగా చిత్రిస్తోంది' అని దుయ్యబట్టారు. కాంగ్రెస్ కార్యకర్తల తీరును ఖండించిన ప్రతిపక్షాలకు ధన్యవాదాలు తెలిపారు. అవి జాతీయాభిమానం, సత్యం వైపు నిలిచాయని కొనియాడారు. ఒక్క కాంగ్రెస్ నేతలు మాత్రమే ఇలాంటి నిరసనకు దిగారని.. దాని మిత్రపక్షాలైన టీఎంసీ, డీఎంకే, బీఎస్పీ, నేషనల్ కాన్ఫరెన్స్ వంటి పార్టీలకు ప్రమేయం లేదని చెప్పారు. ఈ సందర్భంగా మీడియాకు ఓ సూచన చేశారు. 'ప్రతిపక్షంపై మోదీ విరుచుకుపడ్డారు' వంటి శీర్షికలు పెట్టొద్దని.. తద్వారా కాంగట?్రసను కాపాడే ప్రయత్నం చేయొద్దని కోరారు.

## అఫ్ఘానిస్థాన్‌లో పాక్ వైమానిక దాడులు

మొదటి తరువాయి



ఐదుగురే మిగిలారని షహబుద్దీన్ అనే వ్యక్తి కన్నీరుమున్నీరుగా విలపించాడు.

**ప్రతీకారం తప్పదు: తాలిబాన్**

పాక్ దాడులను అఫ్గానిస్థాన్ ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. సరైన సమయంలో సరైన రీతిలో పాక్‌కు బదులిస్తామని తాలిబాన్ ప్రభుత్వ ప్రతినిధి జబీహుల్లా ముజాహిద్ ఆదివారం హెచ్చరించారు. పాక్ దాడుల్లో అమాయకులైన మహిళలు, పిల్లలే మరణించారని ఆరోపించారు. స్కూళ్లు, పౌరుల ఇళ్లపైనే దాడులు జరిగాయని తెలిపారు. ఈ దాడుల ద్వారా అంతర్జాతీయ చట్టాల తోపాటు అఫ్గానిస్థాన్ సార్వభౌమత్వాన్ని పాకిస్థాన్ ఉల్లంఘించిందని మండిపడ్డారు.

## 'వందేమాతరం సైక్లోథాన్' భేష్

మొదటి తరువాయి



ఈ యాత్ర ముగింపు సందర్భంగా కేరళ రాష్ట్రం కొచ్చిలో నిర్వహించిన కార్యక్రమంలో సంజయ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. భారతదేశ తీర ప్రాంతం వేల సంవత్సరాలుగా నాగరికత, వాణిజ్యానికి కేంద్రంగా నిలిచిందన్నారు. 'గుజరాత్‌లోని ప్రాచీన నౌకాశ్రయాల నుంచి గోవా సముద్ర తీరం వరకు, కేరళ మత్స్యకార గ్రామాల నుంచి మడ అడవుల వరకు మన తీర ప్రాంతం దేశ సముద్ర వారసత్వ కథను చెబుతుంది. ఈ సైక్లోథాన్.. ఆ వారసత్వానికి తగిన గౌరవం ఇవ్వడమే కాకుండా దానిని పరిరక్షించాల్సిన బాధ్యతను పునరుద్ఘాటించింద'న్నారు. బలమైన సరిహద్దులు, సురక్షిత తీరాలు కేవలం భద్రతా దళాల వల్ల మాత్రమే కాదని, అవగాహన కలిగిన, శక్తివంతమైన పౌరుల వల్లే సాధ్యమని చెప్పారు. సీఐఎ?సఎ?ఫకు చెందిన 130 మంది సైకిల్ యాత్రికుల్లో 50 శాతం మహిళలే ఉండడం ప్రశంసనీయమన్నారు. వీరంతా మహిళలు ప్రతి రంగంలోనూ దృఢంగా నిలబడగలరని నిరూపించారని చెప్పారు.

## గోదావరి జలాలపై చర్చకు సిద్ధం

మొదటి తరువాయి



మార్చిలో మంత్రివర్గ సమావేశంలో అన్ని అంచనాలకు ఆమోదం తెలుపనున్నట్టు స్పష్టం చేశారు. నెలలోపు దేవాదుల పంపుల మరమ్మతులను పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. రామప్ప చెరువు నుంచి జంపన్నవాగుకు నీరందించే ప్రణాళికపై వెంటనే నివేదికను సమర్పించాలని అధికారులకు సూచించారు. రాబోయే రెండేండ్లలో అన్ని ప్రాజెక్టులను పూర్తి చేయడానికే ఇక్కడికి వచ్చినట్టు చెప్పారు.

**గోదావరి జలాలపై ముఖాముఖి చర్చ**

బడ్జెట్ సమావేశాల అనంతరం గోదావరి జలాలపై ముఖాముఖి చర్చ పెట్టడానికి సిద్ధంగా ఉన్నట్టు సీఎం తెలిపారు. ఈ వివాదాలపై చర్చించడానికి సిద్ధంగా ఉన్నామని, మా తప్పులు ఏంటో, మీ తప్పులు ఏంటో చర్చిద్దామని బీఆర్ఎస్ నేతలనుద్దేశించి అన్నారు. మీది పదేండ్ల అనుభవమని, మాది రెండేండ్ల అనుభవమని, ఎవరేం చేశారో పూర్తిస్థాయి చర్చ చేద్దామని చెప్పారు. ఆరోపణలు చేస్తే అతికేట్టు ఉండాలని, చవకబారు ఆరోపణలు, విమర్శలు చేయొద్దని కేసీఆర్, హరీశ్‌రావుకు సీఎం సూచించారు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి చేసిన సూచనలను రాసుకున్నామని గుర్తు చేశారు. బీఆర్ఎస్ నేతల ఆలోచనల్లో మార్పు రావాలన్నారు. ఇప్పటికీ మాకు ఓటు వేయకపోవడం ప్రజలదే తప్పు అనే భావనలో ఉండటం సరైంది కాదని హితవు పలికారు. మీ తప్పులను సమీక్షించుకోండని సలహానిచ్చారు. సహేతుకమైన విమర్శలు చేయాలన్నారు. ప్రజలు విజ్ఞులు, ప్రజలను తప్పుపట్టడం మానండని బీఆర్ఎస్ నేతలకు సూచించారు. పిల్లి శాపనార్థాలు పెడితే ఉట్టిపడదన్నారు.

కృష్ణా జలాలపై ఎన్నో అపోహలుండేవని, ఈ నేపథ్యంలోనే అసెంబ్లీలో పూర్తిస్థాయి చర్చ పెట్టడం జరిగిందన్నారు. కేసీఆర్, హరీశ్‌రావు.. నీటిపారుదల శాఖ మంత్రులుగా ఉన్నప్పుడు ఏం జరిగింది.. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మంత్రిగా ఉన్న ఈ రెండేండ్లలో ఏం జరిగిందనేది స్పష్టంగా చర్చ జరిగిందని చెప్పారు. వాళ్ల ప్రశ్నలకు సమాధానం కూడా చెప్పామన్నారు. మీరు తప్పు చేశారనే ప్రజలు గుర్తించి శిక్షించారని తెలిపారు. గోదావరి జలాలపై అబద్ధాలను ప్రచారం చేయడం మానుకోవాలని కోరారు. ఒక్క కాళేశ్వరం ప్రాజెక్టుపై రూ.1.10 లక్షల కోట్లు ఖర్చు చేసి ఇతర ప్రాజెక్టులను పట్టించుకోలేదని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. తెలంగాణ ఏర్పడినప్పుడు నీళ్లు, నిధులుండేవని, ఆ పదేండ్లలో ప్రాజెక్టులను పూర్తి చేస్తే ఇప్పుడు ఈ పరిస్థితి వచ్చేది కాదన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వం ఏ ఒక్క ప్రాజెక్టునూ పూర్తి చేయలేదని తెలిపారు. రాష్ట్రంలో రూ.8.11 లక్షల కోట్ల అప్పుల భారముందన్నారు. 2001లో దేవాదుల ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.6 వేల కోట్లు అని, అనంతరం అంచనాలు రూ.13,400 కోట్లకు, రూ.14,500 కోట్లకు పెరిగాయని, తాజాగా రూ.18,500 కోట్లకు అంచనాలు ఎగబాకాయని చెప్పారు. ఇకనైనా ఈ అంచనాలకు ఫుల్‌స్టాప్ పెట్టాలన్నారు. ఈ ప్రాజెక్టును సత్వరమే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్టు చెప్పారు. గోదావరిపైనున్న తుమ్మిడిహట్టి నుంచి భద్రాచలం వరకు ఎన్ని ప్రాజెక్టులుంటే అన్ని ప్రాజెక్టుల పనులనూ సమీక్షించి వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి ఒక్క నీటిబొట్టును లిఫ్ట్ చేయకపోయినా దేశంలో గత రెండేండ్లలో వరిని అత్యధికంగా పండించడంలో, ధాన్యం ఉత్పత్తిలో రాష్ట్రమే నెంబర్ వన్‌గా ఉండేది కాదన్నారు.

## టీమిండియా ఘోర ఓటమి

మొదటి తరువాయి



18.5 ఓవర్లలో భారత్ 111 పరుగులకే కుప్పకూలింది. తొలుత బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా.. డేవిడ్ మిల్లర్ (63, 35 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్స్‌లు), డెవాల్డ్ బ్రెవిస్ (45, 29 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్స్‌లు), ట్రిస్టన్ స్టబ్స్ (44 నాటౌట్, 24 బంతుల్లో 1 ఫోర్, 3 సిక్స్‌లు) మెరవటంతో 187 పరుగులు చేసింది. డేవిడ్ మిల్లర్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు. పేలవంగా పడిపోయారు : భారత్ లక్ష్యం 188 పరుగులు. గతంలో ఈ నల్లమట్టి పిచ్‌పై సఫారీలను చిత్తు చేశారు. కానీ ఎడమ చేతి బ్యాటర్లకు ఆఫ్ స్పిన్‌తో సవాల్ విసిరిన దక్షిణాఫ్రికా తొలి ఓవర్లోనే ఆతిథ్య జట్టుకు షాక్ ఇచ్చింది. ఎడెన్ మార్క్రామ్‌పై ఎదురుదాడి చేయబోయి ఇషాన్ కిషన్ (0), అనవసర షాట్‌తో తిలక్ వర్మ (1) వికెట్ కోల్పోయారు. చక్కని బౌండరీతో పరుగుల ఖాతా తెరిచిన అభిషేక్ శర్మ.. రబాడ ఓవర్లో ఓ సిక్సర్‌తో ఊపందుకున్నాడు. కానీ, నియంత్రణ లేకపోవటం, డాట్స్ బాల్స్ ఒత్తిడికి అభిషేక్ తలొగ్గాడు. యాన్సెన్ ఓవర్లో గాల్లోకి క్యాచ్ ఇవ్వగా.. బాచ్ అద్భుత రీతిలో అందుకున్నాడు. దీంతో 26/3తో భారత్ పీకల్లోతు కష్టాల్లో కూరుకుంది. ఓ ఎండ్‌లో కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (18) నిలిచినా.. దూకుడుగా ఆడేందుకు ఇబ్బంది పడ్డాడు. సాధించాల్సిన రన్‌రేట్ భారీగా పెరగటంతో ఒత్తిడిలో అనవసర షాట్లు ఆడారు. హార్దిక్ పాండ్య (18), రింకు సింగ్ (0), అర్షదీప్ సింగ్ (1) నిరాశపరిచారు. మిడిల్ ఓవర్లలో (7-16) ఐదు వికెట్లు కోల్పోయిన భారత్ 70 పరుగులే చేసింది. ఇక్కడే మ్యాచ్‌పై దక్షిణాఫ్రికా పట్టు బిగించింది. డెత్ ఓవర్లలోపే భారత్ ఆశలు ఆవిరి కాగా.. ఓటమి అంతరం కుదించేందుకు శివం దూబె (42) పోరాడాడు. భారత్ 18.5 ఓవర్లలో 111 పరుగులకే ఆలౌటైంది. సఫారీ బౌలర్లలో కేశవ్ మహరాజ్ (3/24), మార్కో యాన్సెన్ (4/22), కార్బిన్ బాచ్ (2/12) రాణించారు.

## దేవ్‌జీ లొంగుబాటు!

మొదటి తరువాయి

రాష్ట్ర డీజీపీ శివధర్‌రెడ్డి నిర్ధారించారు. దేవ్‌జీతో పాటు మరికొందరు మావోయిస్టులు తెలంగాణ పోలీసులకు లొంగిపోయారని ఛత్తీస్‌గఢ్ డిప్యూటీ సీఎం కూడా చెప్పారు. మావోయిస్టు పార్టీకి చెందిన కేంద్ర, రాష్ట్ర కమిటీల్లో తెలంగాణ వ్యక్తులు 15 మంది ఉన్నారని.. వారంతా లొంగిపోవాలని ఇటీవల రాష్ట్ర డీజీపీ శివధర్‌రెడ్డి సూచించారు. వాస్తవానికి మల్లోజుల లొంగుబాటు తర్వాత వరసగా వివిధ స్థాయుల్లో ఉన్న మావోయిస్టు క్యాడర్ లొంగుబాటుకు తెలంగాణను వేదికగా చేసుకున్నారు. ఇదే క్రమంలో గత కొన్నాళ్లుగా కరీంనగర్‌కు చెందిన తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ, రాజిరెడ్డిల లొంగుబాటుకు సానుకూల వాతావరణం కల్పించాలని ప్రజాసంఘాల నేతలు, మేధావులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఇటీవల ఆపరేషన్ కర్రెగుట్టల పేరిట వేలాది సాయుధ బలగాలను రంగంలో దింపి కేంద్రం మరోసారి మావోయిస్టుల మీద తీవ్ర ఒత్తిడి తెచ్చింది. దీంతో ప్రాణహాని లేకుండా చూస్తే లొంగిపోవడానికి సిద్ధంగా ఉన్నామనే సంకేతాలు దేవ్‌జీ తదితరుల నుంచి వచ్చినట్లు తెలుస్తోంది. హిడ్మా ఎన్‌కౌంటర్ తర్వాత ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాల్లో పట్టుబడిన మావోయిస్టుల్లో దేవ్‌జీ అంగరక్షకులు నలుగురు ఉండడం అనుమానాలకు తావిచ్చింది. ఆయన కదలికల సమాచారం నిఘా వర్గాలకు ఎప్పటికప్పుడు అందుతుందనే అనుమానాలు దీంతో బలపడ్డాయి. కాగా, మావోయిస్టుల లొంగుబాటును సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో చూపాలని పోలీసు ఉన్నతాధికారులు భావిస్తున్నట్లు తెలుస్తోంది. దేవ్‌జీ లొంగుబాటుతో మావోయిస్టు పార్టీ శకం ముగిసినట్లేనని ప్రజా సంఘాల నాయకులు పేర్కొంటున్నారు. మరోవైపు మావోయిస్టు పార్టీ అగ్రనేత గణపతి ఆచూకీ ఇంకా లభించలేదని సమాచారం. ఆయన విదేశాలకు వెళ్లిపోయారనే ప్రచారం జరుగుతోంది.

## ఏఐసీసీకి ఏటీఎంలా తెలంగాణ రేవంత్

మొదటి తరువాయి

అజెండా అని ధ్వజమెత్తారు. రైతులు, మహిళలు, యువత, ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులకు ఇలా అన్ని వర్గాల ప్రజలకు ఇచ్చిన 420 హామీల అమలుతోపాటు అభివృద్ధి పనులకూ ప్రభుత్వం వద్ద రూ పాయి నిధుల్లేవంటూ సాకులు చెప్తున్నారని విమర్శించారు. ఈ రెండేండ్ల కాలంలోనే కాంగ్రెస్ సర్కార్ రూ.3 లక్షల కోట్ల మేరకు భారీగా అప్పులు తెచ్చిందని తెలిపారు. కానీ, రాష్ట్రంలో ప్రభుత్వం అభివృద్ధి కోసం కనీసం ఒక ఇటుక కూడా పేర్చిన దాఖలాలు లేవని విమర్శించారు. ప్రజల సొమ్మును ప్రజా ప్రయోజనాలకు వాడకుండా పకదారి పట్టిస్తున్నారని మండిపడ్డారు.

**పేదల ఇండ్లు, భూములు వదలడం లేదు**

రాష్ట్రంలో సాగుతున్న భూ దోపిడీపైనా కేటీఆర్ స్పందించారు. మూసీ సుందరీకరణ పేరిట పేదల ఇండ్లను, లగచర్ల సహా పలుచోట్ల గిరిజనుల భూములను, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ) భూములనూ రేవంత్ సర్కార్ వదలడం లేదని మండిపడ్డారు. హిల్ట్ పాలసీ పేరిట పరిశ్రమల భూములను అనుముల బ్రదర్స్ కలిసి అంబుక పడుతున్నారని, ఒక పద్ధతి ప్రకారం రాష్ట్ర వనరులను లూటీ చేస్తున్నారని ఆరోపించారు. ప్రజల కష్టార్జితాన్ని దారిమళ్లిస్తూ రాష్ట్ర భవిష్యత్తును అంధకారంలోకి నెట్టివేస్తున్న ఈ కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కేటీఆర్ కోరారు.

## పోస్టల్ సేవలు వెలకట్టలేనివి

మొదటి తరువాయి

ఉద్యోగులను జ్యోతిరాదిత్య ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.. తపాలా సేవలకు 150 ఏళ్ల చరిత్ర ఉందని, ఇప్పటికీ గ్రామాల్లో వీరి సేవలు కొనసాగడం ముదావాహమన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో కీలకంగా పని చేశారని గుర్తు చేశారు. ఎంత టెక్నాలజీ వచ్చినా మానవత్వంతో పని చేసేది డాక్ సేవకులేనని, డాక్ సేవకులు లేకపోతే గ్రామీణ ప్రాంతంలో లాజిస్టిక్ వ్యవస్థ ఉండదన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సూపర్ సిక్స్ పథకాలకు వీరి సేవలను వినియోగించుకుంటామని చెప్పారు. మెషిన్లు, ఏఐ ద్వారా ఏ పనైనా జరుగుతుంది కానీ మనిషి ఇచ్చే హ్యూమన్ టచ్ డాక్ సేవకులు మాత్రమే ఇవ్వగలరని కొనియాడారు. బాగా చదువుకున్నవాళ్లు గ్రామాల్లో ఉండి ప్రజలకు సేవ చేసేందుకు పోస్టల్ జాబ్ చేస్తున్నారని చెప్పారు. గ్రామీణ డాక్ సేవక్‌లకు త్వరలో ఎలక్ట్రిక్ స్కూటర్లు ఇవ్వనున్నట్టు జ్యోతిరాదిత్య తెలిపారు. ప్రధానంగా గ్రామీణ డాక్ సేవక్ ఉద్యోగులకు కనీస మౌలిక సదుపాయాలు లేవని గుర్తించి, తాను కేంద్ర ఆర్థిక మంత్రికి నిధుల కోసం ప్రతిపాదనలు ఇచ్చానని తెలిపారు. గ్రామీణ డాక్ సేవక్‌ల పిల్లలకు కేంద్రీయ విద్యాలయాలల్లో సీట్లు ఇప్పిస్తున్నామని, తపాలా వ్యవస్థపై ప్రజలల్లో ఇంకా విశ్వాసం ఉందని తెలిపారు. ఎన్ని ఉపద్రవాలు వచ్చినా గ్రామీణ డాక్ సేవక్‌లు తగ్గేదేలే అన్నట్టుగా పనిచేస్తున్నారని పుష్ప సినిమా డైలాగులను ఆయన ప్రస్తావించారు. గుంటూరు నుంచి మిర్చి ఇతర దేశాలకు, రాష్ట్రాలకు చేరవేయడంలో పోస్టల్ శాఖ కూడా కీలక పాత్ర పోషిస్తుందన్నారు. పార్శిల్, మెయిల్ నెట్ వర్క్‌లో వేగం పెరగాలన్నారు. కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ.. తపాలా సేవలకు కేంద్రం రూ.35 కోట్లు ఖర్చుపెడుతుంటే రూ.13 కోట్ల ఆదాయం వస్తుందన్నారు. తపాలా శాఖను లాభాల్లోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. సభలో పోస్టల్ శాఖ ఉన్నతాధికారులు సురేంద్రకుమార్, శ్రీదేవి, గుంటూరు మేయర్ కోవెలమూడి రవీంద్ర, స్థానిక ఎమ్మెల్యే నశీర్ అహ్మద్ తదితరులు పాల్గన్నారు.

# అందరికీ ఆమోదయోగ్యమైన ఈహెచ్‌ఎస్ అమలు చేయాలి

## - కర్రు సురేష్



**పెద్దపల్లి, ఫిబ్రవరి 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఉద్యోగులు, ఉపాధ్యాయులు కోరుకున్నట్లుగా అందరికీ ఆమోదయోగ్యమైన ఎంప్లాయి హెల్త్ స్కీంను అమలు చేయాలని పీఆర్టీయూ టీఎస్ పునర్నిర్మాణ రాష్ట్ర కన్వీనర్ కర్రు సురేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ప్రభుత్వం త్వరలో ప్రవేశపెట్టనున్న ఈహెచ్‌ఎస్ ప్రతిపాదనల్లో ఉద్యోగుల మూలవేతనంలో 1.5 శాతం వాటా ఇవ్వాలనే అంశంపై తీవ్ర ఆక్షేపణలు వస్తున్నాయని ఆయన తెలిపారు. ఇది ఉద్యోగుల సంక్షేమానికి విరుద్ధమని, కొందరిని మాత్రమే ప్రభుత్వానికి సహకరించేలా చేస్తుందని విమర్శించారు.అందరికీ సమానంగా రూ.500 వసూలు చేసి, ప్రతి సంవత్సరం కేంద్ర ప్రభుత్వ హెల్త్ స్కీం రేట్ల స్లాబ్ ప్రకారం హాస్పిటళ్లకు చెల్లించే విధంగా, ఏ కార్పొరేట్ హాస్పిటల్‌లోనైనా నగదు రహిత చికిత్స అందేలా తక్షణమే అమలు చేయాలని ఆయన కోరారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సంక్షేమం పట్ల చిత్తశుద్ధితో ప్రభుత్వం ముందుకు వస్తున్నందుకు కృతజ్ఞతలు తెలుపుతూ, కమిటీల పేరుతో కాలయాపన చేయకుండా వెంటనే అమలు చేసి సంక్షేమం పట్ల చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని కర్రు సురేష్ పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు.

# అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం




**హుస్నాబాద్, ఫిబ్రవరి 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: విశ్వ సాహితీ కళా వేదిక వ్యవస్థాపకురాలు కొల్లి రమాదేవి సారధ్యంలో మార్చి 1న విజయవాడలోని బాలోత్సవ భవన్, రాఘవయ్య పార్క్ వద్ద అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం జరగనుంది.ఈ సందర్భంగా వివిధ రంగాలలో ప్రతిభ కనబరిచిన మహిళలకు శ్రీ శక్తి పురస్కారంతో పాటు పట్టాభిషేకం చేయాలని నిర్ణయించారు. సామాజిక సేవకురాలు కర్ణకంటి మంజుల రెడ్డి చేసిన కృషిని గుర్తించి అభినందించేందుకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.విశ్వ సాహితీ కళా వేదిక తరపున ప్రేమపూర్వక ఆహ్వానం అందజేస్తున్నామని ప్రకటనలో పేర్కొన్నారు.

# వీధి కుక్కల స్వైర విహారం



**కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
6వ డివిజన్ గుంటూరుపల్లిలో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. సాయవేణి శ్రీనివాస్‌కి చెందిన బర్రె దూడపై వీధి కుక్కలు దాడి చేయగా, ఆయన సకాలంలో స్పందించి దగ్గరికి చేరుకోవడంతో అవి పారిపోయాయి. ఇటీవలి కాలంలో గొర్రెల కాపారుల మందలపై వీధి కుక్కలు విచ్చలవిడిగా దాడి చేసి గొర్రెలను, మేకలను చంపేస్తున్నాయి. రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనాలపై వెళుతున్న వారినీ వెంబడిస్తున్నాయి.ఈ సమస్యపై అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# యథావిధిగా ప్రజావాణి

## - కలెక్టర్ పమేలా సత్పతి



**కరీంనగర్, ఫిబ్రవరి 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జిల్లా కలెక్టరేట్ ఆడిటోరియంలో ప్రజల సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమాన్ని యథావిధిగా సోమవారం నుంచి కొనసాగించనున్నట్లు జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

# మహానీయుల ఆశయాలు విగ్రహాలకే పరిమితం కాకూడదు

## - నరేష్ దండు



**హైదరాబాద్, ఫిబ్రవరి 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
దేశంలో మహానీయుల విగ్రహాలు, సంస్మరణ సభలు పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నప్పటికీ, వారి ఆశయాలు, స్ఫూర్తి మాత్రం మరుగున పడుతున్నాయని సామాజిక కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంబేద్కర్, సర్వాయి పాపన్న, ఛత్రపతి శివాజీ, చాకలి ఐలమ్మ, సేవాలాల్ మహారాజ్ వంటి మహానీయులు కుల వివక్ష నిర్మూలన, స్వరాజ్య స్థాపన, బానిసత్వ నిర్మూలన, ఆత్మగౌరవం కోసం పోరాడి ప్రాణాలు అర్పించారు. కానీ నేటి పరిస్థితుల్లో వారి విగ్రహాలను కులం, మతం పేరిట నెలకొల్పి, సభలు నిర్వహించడం ఫ్యాషన్‌గా మారిందని విమర్శలు వినిపిస్తున్నాయి.వారి ఆశయాలను మరచి, రాజకీయ లాభాల కోసం విగ్రహాలు, సభలు వినియోగించడం సమాజంలో విభజనలకు దారి తీస్తోందని పర్యావరణ పరిరక్షణ సమితి చైర్మన్ నరేష్ దండు పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ, "మహానీయుల విగ్రహాలు కాదు, వారి ఆశయాలను మన జీవితంలో ప్రతిబింబించే ప్రయత్నమే అవసరం. సమానత్వం, సత్యం, సౌభాగ్యం సాధించడమే వారి నిజమైన మార్గం" అని అన్నారు.

# కుమ్మర సంఘం సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి





**మిర్యాలగూడ, ఫిబ్రవరి 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మిర్యాలగూడ పట్టణంలోని బీసీ భవన్‌లో తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి సర్వ సభ్య సమావేశం శనివారం జరిగింది.ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి హాజరై, కుమ్మర సంఘం సభ్యులతో కలిసి మట్టి కుండలు తయారు చేసి, అనంతరం నూతన క్యాలెండర్‌ను విడుదల చేశారు. పలువురిని ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "కుల వృత్తులు కొనసాగిస్తూ తమ సాంప్రదాయాలను, సంస్కృతిని కాపాడుతున్న కుమ్మర సంఘం సభ్యులకు నేను ఎల్లప్పుడూ అండగా ఉంటాను. నా వంతు సహాయ సహకారాలు అందిస్తాను" అని తెలిపారు.కార్యక్రమంలో కుమ్మర సంఘం నాయకులు, కార్యకర్తలు, సభ్యులు పాల్గొన్నారు.

# అమానుష దాడి

## -- చర్యలు తీసుకోవాలని ఆచారి డిమాండ్



**ఆమనగల్లు, ఫిబ్రవరి 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నాగర్‌కర్నూల్ జిల్లా కుమ్మెర మల్లన్న జాతరలో రజక కుటుంబంపై జరిగిన దాడిలో పసిపాప మృతి చెందడం అమానుషమని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు ఆచారి తీవ్రంగా ఖండించారు.ఆదివారం ఆయన మాట్లాడుతూ, బాధ్యులపై కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా అందించి, వారి మనోధైర్యాన్ని పెంచాలని కోరారు.కుటుంబానికి బీజేపీ అండగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

# ఘనంగా శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి కళ్యాణ మహోత్సవం



**అమ్రాబాద్, ఫిబ్రవరి 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పదర మండలం రాయలగండి గ్రామంలో శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి కళ్యాణ మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచుకుల రాజేష్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.గౌరవ శాసనసభ్యులు డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, సీబీఎమ్ ట్రస్ట్ చైర్‌పర్సన్ డాక్టర్ చిక్కుడు అనురాధ ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళ్యాణ మహోత్సవానికి ఆహ్వానించినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. చెన్నకేశవ స్వామి దర్శనం శుభ సూచకమని, దేవస్థానం అభివృద్ధి కోసం తన సొంత నిధులతో సహకరించనున్నట్లు ప్రకటించారు.అచ్చంపేట నియోజకవర్గం నలుమూలల నుంచి భక్తులు ఈ మహోత్సవానికి హాజరుకావడం విశేషమని ఎమ్మెల్యే పేర్కొన్నారు.కార్యక్రమంలో ఉమ్మడి అమ్రాబాద్ మండల కాంగ్రెస్ నాయకులు, మార్కెట్ కమిటీ చైర్మన్ రజిత మల్లేష్, సింగిల్ విండో చైర్మన్ పోషం గణేష్, అచ్చంపేట మాజీ ఎంపీపీ రామనాథం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోపాల్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ చెన్నకేశవులు, కుందా మల్లికార్జున్, గోవర్ధన్, ఉమ్మడి వెంకటేశ్వర్లు, వివిధ గ్రామాల సర్పంచులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు, దేవస్థాన కమిటీ సభ్యులు, అధికారులు, పత్రికా విలేకరులు పాల్గొన్నారు.

# కౌన్సిలర్ ఉప్పు స్వరూప--రాజు సమక్షంలో ఆత్మీయ సన్మాన మహోత్సవం



**పెద్దపల్లి, ఫిబ్రవరి 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పెద్దపల్లి మున్సిపల్ పరిధిలోని 22వ వార్డులో డీఆర్. కేవి రావు గ్యాపాకర్థం కామన్ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన అనంతరం వార్డు కౌన్సిలర్ ఉప్పు స్వరూప--రాజు ఆధ్వర్యంలో ఆత్మీయ సన్మాన మహోత్సవ కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణా రావు పాల్గొన్నారు. ముందుగా 22వ వార్డు ప్రజలు ఘన స్వాగతం పలికారు. అనంతరం వార్డు కౌన్సిలర్ ఉప్పు స్వరూప రాజు ఎమ్మెల్యే విజయరమణా రావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్ నుగ్గిళ్ల మల్లయ్య, వైస్ చైర్మన్ ముస్కాన్ నాజ్ నయ్యర్, కౌన్సిలర్లు శ్రీకాంత్, కొమ్ము సుధాకర్, అమ్రేశ్, కమల్, గుజ్జుల కుమార్, కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, వార్డు ప్రజలు, మహిళలు పాల్గొన్నారు.

# మేయర్ కొలగాని శ్రీనివాసును సన్మానించిన లఘు చిత్రాల నటుడు రవికుమార్



**కరీంనగర్, ఫిబ్రవరి 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ నగర పాలక సంస్థ మేయర్ కొలగాని శ్రీనివాసును సామాజికవేత్త, కవి రచయిత, ఇండియన్ ఐకాన్ అవార్డు గ్రహీత, యూట్యూబ్ నటుడు--దర్శకుడు పసుల రవికుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఆయన మేయర్‌ను శాలువాతో సన్మానించి, పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ రవికుమార్ చేస్తున్న సామాజిక సేవలను కొనియాడుతూ, ప్రజలకు ఉపయోగపడే లఘు చిత్రాలు తీయాలని సూచించారు.రవికుమార్ మాట్లాడుతూ సామాజిక సేవలను కొనసాగిస్తూ ప్రజలకు ఉపయోగపడే లఘు చిత్రాలను రూపొందిస్తానని తెలిపారు.

## కాలనీలలో మౌలిక సదుపాయాలు కల్పిస్తానని కౌన్సిలర్ రాజు నాయక్ హామీ

**షాద్‌నగర్, ఫిబ్రవరి 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
షాద్‌నగర్ పట్టణంలోని ఆరో వార్డులో మౌలిక సదుపాయాల అభివృద్ధికి కృషి చేస్తానని పట్టణ కౌన్సిలర్ డి. రాజు నాయక్ స్పష్టం చేశారు. ఆదివారం టీచర్స్ కాలనీలో రహదారి సమస్యపై స్థానికులు వివరించగా, వెంటనే స్పందించిన ఆయన రోడ్డులో మట్టి పోసి జెసిబి వాహనంతో లెవెల్ చేయించారు. పనులు పూర్తయ్యే వరకు అక్కడే ఉండి పర్యవేక్షించారు. భవిష్యత్తులో కాలనీల్లో ఎక్కడ సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానని రాజు నాయక్ హామీ ఇచ్చారు.

## టిప్పర్ ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు





**తెలకపల్లి, ఫిబ్రవరి 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తెలకపల్లి మండల పరిధిలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు కాగా, ఇద్దరికి స్వల్ప గాయాలు అయ్యాయి. స్థానిక ఎస్సై బి. నరేష్ తెలిపిన వివరాల ప్రకారం, పెద్దూరు గ్రామానికి చెందిన బాలకృష్ణ తన భార్య, కుమారుడు, బావమరిది మణికంఠతో కలిసి కారు (నెంబర్ టీజీ31- బీ-0301)లో నాగర్‌కర్నూల్ నుండి లింగాలకు వెళ్తుండగా, కమ్మరెడ్డిపల్లి గేటు దగ్గర లింగాల నుండి తెలకపల్లి వైపు అతివేగంగా వస్తున్న టిప్పర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ మణికంఠ ఎడమ చేయికి తీవ్ర గాయాలు కావడంతో 108 అత్యవసర వాహనంలో నాగర్‌కర్నూల్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. బాలకృష్ణ, ఆయన భార్య, కుమారునికి స్వల్ప గాయాలు అయ్యాయి. బాలకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు టిప్పర్ డ్రైవర్, కొండాపూర్ గ్రామానికి చెందిన దొరమోని లింగంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బి. నరేష్ తెలిపారు.

## సేవాలాల్ మహారాజ్ చూపిన సన్మార్గం ప్రతి ఒక్కరికీ ఆదర్శం

-- ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్





**హైదరాబాద్, ఫిబ్రవరి 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
హైదరాబాద్ గుర్రంగూడలో ఆదివారం బంజారా నాయకులు నిర్వహించిన సద్గురు సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ పాల్గొని, సేవాలాల్ మహాబోగ్ (హోమం) పూజలో ప్రజా ప్రతినిధులు, బంజారా నాయకులతో కలిసి నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, “బంజారా సమాజ ఆరాధ్య దైవం శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ సమాజ శ్రేయస్సు కోసం చూపిన సన్మార్గం ప్రతి ఒక్కరికీ ఆదర్శం. ఆయన ఆశయాలను స్మరించుకోవడం, వాటిని ఆచరణలో పెట్టడం మనందరి బాధ్యత” అని అన్నారు. జయంతి సందర్భంగా మహారాజ్ సేవలను ప్రతి ఒక్కరూ గుర్తుచేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, బంజారా నాయకులు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆడ బిడ్డ వివాహానికి రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్టు సహాయం

- రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జర్పుల దశరద్ నాయక్



**కడ్తాల్, ఫిబ్రవరి 22 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
కడ్తాల్ మండలం గనుగుమర్ల తండ గ్రామపంచాయతీ కి చెందిన మూణావత్ శారద కిషన్ దంపతుల కూతురు మంజుల వివాహానికి 21000 వేల రూపాయలు పట్టుచీర ను రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు దశరథ్ నాయక్ మూడవత్ శారద కిషన్ దంపతుల కూతురు మంజుల వివాహానికి హాజరై ఇట్టి సహాయాన్ని అందించడం జరిగింది. గానుగుమర్ల తండా గ్రామ పంచాయతీ సర్పంచ్ సేవ్య నాయక్ 20000 వేల రూపాయలను అందించడం జరిగింది. ఈ సందర్భంగా శారద కిషన్ దంపతులు మాట్లాడుతూ తమ ఆడబిడ్డ మంజుల పెండ్లికి పెద్దన్నల పెద్ద మనసుతో సహాయం చేసిన కడ్తాల్ మాజీ జెడ్పిటిసి దశరథ్ నాయక్ అలాగే స్థానిక సర్పంచ్ సేవ్య నాయక్ లకు కృతజ్ఞతలు తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు జర్పుల దశరథ్ నాయక్ మాట్లాడుతూ కడ్తాల్ మండలం లో ఏ నిరుపేద ఆడబిడ్డకు పెళ్లి చేయాలన్న అట్టి కుటుంబ సభ్యులకు రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ అండగా ఉండి ఆర్థిక సహాయం చేస్తుందని ఈరోజు గనుగు మర్లతండా గ్రామ పంచాయతీకి చెందిన మునావత్ శారద కిషన్ దంపతుల కూతురు మంజుల పెళ్ళికి తమ చారిటబుల్ ట్రస్ట్ తరఫున 21 వేల రూపాయలను అలాగే పట్టుచీరను ఇవ్వడం జరిగిందని స్థానిక సర్పంచ్ సేవ్య నాయక్ 20వేల రూపాయలను ఇవ్వడం జరిగిందని మొత్తం 41 వేల రూపాయలను ఒక పట్టు చీరను ఇవ్వడం జరిగిందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు శీను నాయక్ చాంది లక్ష్మణ్ నాయక్ మాజీ ఉప సర్పంచ్ శారదా పాండు, సక్రు, మునేష్,హరి,రాకేష్, మహేష్,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని జేఏసీ డిమాండ్



**హుస్నాబాద్, ఫిబ్రవరి 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని, 2021 వేతన సవరణలో 30% ఫిట్మెంట్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆర్టీసీ జేఏసీ ఆధ్వర్యంలో ఈనెల 24న చలో సెక్రటేరియట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉమ్మడి కరీంనగర్ జిల్లా జేఏసీ జాయింట్ సెక్రటరీ ఎంపీ రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ ఆయన, ఉద్యోగుల కుటుంబాల భద్రత కోసం ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని, ట్రేడ్ యూనియన్ ఆంక్షలు ఎత్తివేసి గుర్తింపు పొందిన సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని కోరారు. ఎలక్ట్రిక్ బస్సులను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, మహిళా సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని, రిటైర్ అయిన ఉద్యోగుల బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్తంగా అన్ని డిపోల నుండి కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని చలో సెక్రటేరియట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. న్యాయపరమైన హక్కుల సాధనకై ఆర్టీసీ ఇక ఉద్యమం తప్పదని ఎంపీ రెడ్డి హెచ్చరించారు.

## మున్సిపల్ మేయర్‌గా బాధ్యతలు స్వీకరించిన కోలగాని శ్రీనివాస్





**కరీంనగర్, ఫిబ్రవరి 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ నగరపాలక సంస్థ మేయర్‌గా కోలగాని శ్రీనివాస్ ఆదివారం మున్సిపల్ కార్యాలయంలో పదవి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, మున్సిపల్ కమిషనర్, కార్పొరేటర్లు, మున్సిపల్ సిబ్బంది మేయర్‌ను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. మేయర్‌గా తొలి సంతకం వేసిన శ్రీనివాస్, రాబోయే వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని తాగునీటి అవసరాల కోసం రూ.49 లక్షల అభివృద్ధి పనుల ఫైల్‌పై సంతకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మేయర్‌గా అవకాశం కల్పించిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్, రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు, జాతీయ, రాష్ట్ర, జిల్లా నాయకత్వానికి ధన్యవాదాలు తెలిపారు. పట్టణ ప్రజలు6 బీజేపీపై నమ్మకంతో నగరపాలక సంస్థ బాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. నగరంలోని 66 డివిజన్ల అభివృద్ధి కోసం నిరంతర కృషి చేస్తానని, ప్రజలకు మౌలిక సదుపాయాలు, పౌర సేవలు వేగవంతంగా అందేలా చర్యలు తీసుకుంటానని చెప్పారు. కరీంనగర్‌ను ఆదర్శవంతమైన, సుందర నగరంగా తీర్చిదిద్దేందుకు అందరి సహకారంతో ముందుకు సాగుతానని మేయర్ శ్రీనివాస్ స్పష్టం చేశారు.

## సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి




**కల్వకుర్తి, ఫిబ్రవరి 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కల్వకుర్తి పట్టణంలో బంజారా సోదరులు ఆదివారం నిర్వహించిన సద్గురు సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, తెలంగాణ రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు ఠాకూర్ బాలాజీ సింగ్, తెలంగాణ విద్యా కమిషన్ సభ్యుడు డాక్టర్ చారకొండ వెంకటేష్, టీ-సాట్ సీఈవో వేణుగోపాల్ రెడ్డి, కల్వకుర్తి మున్సిపాలిటీ చైర్‌పర్సన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ సంజీవ్ యాదవ్, మున్సిపాలిటీ వైస్ చైర్మన్ షానవాజ్ ఖాన్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## జగిత్యాలలో పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహాభియాన్



**జగిత్యాల, ఫిబ్రవరి 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జగిత్యాల జిల్లా కార్యశాలలో పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహాభియాన్--2026 కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగ శ్రావణి, జిల్లా అధ్యక్షుడు రాచకొండ యాదగిరి బాబు, ప్రశిక్షణ అభియాన్ ఇన్‌చార్జ్ ఎస్. కుమార్, జిల్లా ఇన్‌చార్జ్ గడ్డం శ్రీనివాస్ పాల్గొన్నారు. అలాగే జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్డేపల్లి శ్రీనివాస్, కన్నం అంజన్న, దూరిశెట్టి మమతతో పాటు జిల్లా, మండల పదాధికారులు హాజరయ్యారు.

## అధునాతన లాపరోస్కోపిక్, రోబోటిక్స్ సర్జరీలో ఫెలోషిప్‌లు సాధించిన డాక్టర్ ప్రదీప్‌కుమార్



**కరీంనగర్, ఫిబ్రవరి 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ గ్యాస్ట్రోఇంటెస్టినల్ ఎండోసర్జన్స్, ఎండోస్కోపిక్ అండ్ లాపరోస్కోపిక్ సర్జన్స్ ఆఫ్ ఏషియా ఆధ్వర్యంలో ముంబైలోని ది వెస్టిన్ ముంబై పోవై లేక్‌లో 23వ అంతర్జాతీయ సదస్సు జరిగింది. ఈ సదస్సులో కరీంనగర్ శ్రీసాయి లైఫ్‌లైన్ హాస్పిటల్ చైర్మన్, రాష్ట్రంలో ప్రముఖ లాపరోస్కోపిక్ సర్జన్ డాక్టర్ సిహెచ్ ప్రదీప్‌కుమార్ రోబోటిక్స్‌లో అధునాతన లాపరోస్కోపిక్ సర్జరీ, ఫాల్స్ రోబోటిక్స్ సర్జరీలో ఫెలోషిప్‌లు అందుకున్నారు. అంతర్జాతీయ లాపరోస్కోపిక్ సర్జన్ల సమక్షంలో ఈ ఫెలోషిప్‌లు ఆయనకు ప్రదానం చేయడం విశేషమైంది.

## భ్రమరాంబ మల్లికార్జున స్వామి మల్లన్న స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో పాల్గొన్న ఎమ్మెల్యే


ప్రతి గుండె స్పందన అభిమనంగా మారుతుంది..
ప్రతి చూపు విశ్వాసంగా మారి ఆశీర్వాదమై నిలుస్తుంది.
- ఎమ్మెల్యే బాలు నాయక్



**దేవరకొండ ఫిబ్రవరి 22. (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
చింతపల్లి మండలంలోని నెల్వలపల్లి గ్రామంలో నిర్వహించిన శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి మల్లన్న స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలలోపాల్గొని, స్వామి వారిని దర్శించుకొని,స్థానిక నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు మరియు భక్తులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించిన దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్.ఆ భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారి ఆశీస్సులతో దేవరకొండ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, సుభిక్షంగా జీవించాలని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, ముఖ్య నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మత సామరస్యానికి ప్రతీక సయ్యద్ హజ్రత్ అబాస్ దర్గా

-సయ్యద్ హజ్రత్ అబాస్ దర్గాలో ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించిన మాజీ మంత్రి,సూర్యాపేట శాసనసభ్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి.
-బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు,దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్



**దేవరకొండ ఫిబ్రవరి 22. (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
మత సామరస్యానికి ప్రతీక సయ్యద్ హజ్రత్ అబాస్ దర్గా అని మాజీ మంత్రి,సూర్యాపేట శాసనసభ్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి,బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు,దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు.ఆదివారం చింతపల్లి మండలం పీకే మల్లెపల్లిలోని సయ్యద్ హజ్రత్ అబాస్ దర్గాలో వారు ప్రత్యేక పార్ధనలు నిర్వహించారు.అనంతరం మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్ ని సన్మానించారు.ఈ కార్యక్రమంలో పలువురు బిఆర్ఎస్ పార్టీ నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

## జీనియస్ చెస్ అకాడమీ సమక్షంలో యూ-13 జూనియర్స్ & ఓపెన్ చెస్ టోర్నమెంట్



**కరీంనగర్, ఫిబ్రవరి 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
భగత్‌నగర్‌లో జీనియస్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన లిఓపెన్ & జూనియర్స్ చెస్ టోర్నమెంట్‌లిను డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెస్ మేధాశక్తిని పెంపొందించే ఆట అని, ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా నేర్చుకోవాల్సిన గేమ్ అని అన్నారు. జీనియస్ చెస్ అకాడమీ డైరెక్టర్ అనూప్ కుమార్ సేవలను గుర్తుచేస్తూ, వేద భవన్, బాలకుటీర వంటి విద్యార్థులకు ఉచితంగా చెస్ నేర్పించడం గొప్పతనమని అభినందించారు. అనంతరం చెస్ గేమ్‌లో తొలి ఎత్తు వేశారు.కార్యక్రమంలో అకాడమీ చైర్మన్ కంకటి కనకయ్య, పండుగ నాగరాజు, నూనె సాయికృష్ణ, కోఆర్డినేటర్ సృజన్ కుమార్, చీఫ్ ఆర్బిటర్ అనిల్, వెంకన్న, కోచ్‌లు అభిరామ్, రేవిక్, ప్రభు, శ్రీనిజ, స్వాతి, సిరి తదితరులు పాల్గొన్నారు.

# పరీక్షల వేళ విజయం వైపు ధైర్యమైన అడుగులు





పదవ తరగతి, ఇంటర్ పరీక్షలు సమీపిస్తున్న ఈ కీలక సమయంలో విద్యార్థులు ముందుగా గత రోజులలో నేర్చుకున్న పాఠాలను ప్రశాంతంగా రివిజన్ చేయాలి. కొత్త అంశాల కంటే పునశ్చరణకు ప్రాధాన్యం ఇవ్వాలి. సరైన నిద్ర (కనీసం 7--8 గంటలు), తేలికపాటి ఆహారం, తగినంత నీరు తీసుకోవడం శారీరక-మానసిక ఆరోగ్యానికి అవసరం. పరీక్ష హాల్ టికెట్, అవసరమైన స్టేషనరీ ముందురోజే సిద్ధం చేసుకుని, పరీక్ష కేంద్రానికి కనీసం అరగంట ముందే చేరుకోవాలి.

తల్లిదండ్రులు పిల్లలపై అధిక ఒత్తిడి చేయకుండా, ధైర్యం నింపే మాటలు చెప్పాలి. మార్కులు జీవితానికి అంతిమ గమ్యం కాదని గుర్తు చేయాలి. కొందరు విద్యార్థులు భయపడుతుంటే, ఉపాధ్యాయులు వారికి ఆత్మవిశ్వాసం కలిగించేలా మార్గనిర్దేశనం చేయాలి. పరీక్ష ఒక అవకాశమే కానీ అంతిమ నిర్ణయం కాదు. ప్రశాంతత, క్రమశిక్షణ, ధైర్యం --- ఇవే విజయానికి నిజమైన మంత్రాలు.

**వ్యాసకర్త**
గంగవరం రామకృష్ణారెడ్డి



# గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవా లాల్

-ఆ మహనీయుడి అడుగుజాడల్లో పయనించాలి .
-బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు,దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ .

**హైదరాబాద్ ఫిబ్రవరి 22 (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ అని బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు,దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ కొనియాడారు.
హైదరాబాద్ గుర్రంగూడ లో సంత్ సేవాలాల్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....ఆ మహనీయుడి అడుగుజాడల్లో పయనించాలని పిలుపునిచ్చారు. యావత్ భారతదేశం గర్వించదగ్గ ఆధ్యాత్మికవేత్త సేవాలాల్ మహారాజ్ అంటూ అభివర్ణించారు. కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ సర్కారు గిరిజనుల ఆరాధ్యదైవమైన సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని అధికారికారంగా నిర్వహించిందని గుర్తు చేశారు. గిరిజనుల అభివృద్ధి, సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి పకడ్బందీగా అమలు చేసిందన్నారు. తండాలను గ్రామ పంచాయతీలుగా గుర్తించి గిరిజనులకు రాజ్యాధికారంలో కీలక భాగస్వామ్యం చేసిన ఘనత కేసీఆర్ దేనని ఆయన తెలిపారు. హైదరాబాద్‌లో బంజారాహిల్స్‌గా




పిలుచుకుంటున్న ప్రాంతంలో మూడు శతాబ్దాల క్రితమే సేవాలాల్ మహారాజ్ నడయాడారని, అదే బంజారాహిల్స్ నేలమీద వారి పేరుతో నిర్మించిన భవన్‌లో బీఆర్ఎస్ సర్కార్ అధికారికంగా నిర్వహించిందని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవిస్తే అణగారిన వర్గాల అస్తిత్వానికి, ఆత్మగౌరవానికి తగిన గుర్తింపు దక్కుతుందనడానికి వారి జయంతి ఉత్సవాల నిర్వహణ మరో ఉదాహరణగా నిలిచిందని పేర్కొన్నారు. అడవి బిడ్డల ప్రత్యేకమైన ప్రకృతి ఆరాధన, ఆధ్యాత్మిక దృక్పథం, సామాజిక సాంస్కృతిక జీవన విధానాన్ని కాపాడటానికి సేవాలాల్ మహారాజ్ చేసిన కృషి గొప్పదని వెల్లడించారు. తన ప్రజలను బయటి సమాజం నుంచి అనుక్షణం రక్షించుకొనే దిశగా సంత్ సేవాలాల్ జీవితాంతం పోరాటం సాగించారని పేర్కొన్నారు. ఆ దిశగా వారు కల్పించిన చైతన్యం, వారు చేపట్టిన కార్యాచరణ దేశవ్యాప్తంగా ఉన్న లంబాడా/బంజారాలకు రక్షణ కవచంగా నిలిచిందని వివరించారు. బంజారాలకు స్ఫూర్తి ప్రదాతగా నాటి కాలంలో వారు చేసిన కృషి, విశ్వవ్యాప్తంగా ఉన్న బంజారాలకు వారిని ఆధ్యాత్మిక గురువుగా, తమ ఆరాధ్య దైవంలా కొలిచేలా చేసిందని గుర్తుచేశారు. గిరిజన బిడ్డల ఆత్మగౌరవం పరిఢవిల్లేలా వారి ప్రతిభను చాటేందుకు, ఉద్యోగ, ఉపాధి, విద్య, క్రీడలు తదితర రంగాల్లో బీఆర్ఎస్ సర్కారు అనేక కార్యక్రమాలను నిర్వహించిందని చెప్పారు. హైదరాబాద్ నగరం నడిబొడ్డున, అత్యంత ఖరీదైన ప్రాంతంలో సంత్ సేవాలాల్ మహారాజ్ పేరుతోనే బంజారా భవన్‌ను వారి ఆత్మగౌరవం ఉట్టిపడేలా బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిందని తెలిపారు. ఇందులో సంత్ సేవాలాల్ విగ్రహ ప్రతిష్ఠాపన చేసిందన్నారు. గిరిజనులంతా ఐకమత్యంతో మెలిగి పార్టీలకు అతీతంగా కృషి, పట్టుదలతో పరస్పర సమన్వయంతో పనిచేసి అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో పలువురు గిరిజన సంఘాల నాయకులు తదితరులు ఉన్నారు.

# 130 జిల్లా పరిషత్ పాఠశాలలో పెన్నుల పంపిణీ మహాయజ్ఞం

**కరీంనగర్, ఫిబ్రవరి 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: సోల్జర్‌కి గన్ను... స్టూడెంట్‌కి పెన్ను అనే ఉత్తేజకర నినాదంతో తెలంగాణ శ్రీనివాస్ సేవా సంస్థ ఆధ్వర్యంలో సరస్వతీ కటాక్షం పెన్నుల పంపిణీ మహాయజ్ఞం ఘనంగా జరిగింది. చిలుకూరి బాలాజీ సుందరేశ్వర శివాలయం ప్రధాన అర్చకులు సురేష్ ఆత్మారాం మహరాజ్ సత్సంకల్పంతో సమకూర్చిన 8,000కు పైగా పెన్నులను ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా 130కు పైగా ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఒకే రోజున పంపిణీ చేశారు.విద్యార్థి చేతిలోని పెన్నే అతని భవిష్యత్తుకు బలమైన ఆయుధమనే సందేశంతో చేపట్టిన ఈ కార్యక్రమం పరీక్షల దశలో ఉన్న విద్యార్థులకు ప్రోత్సాహాన్ని అందించడంతో పాటు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించింది. విద్యా సేవ సమాజ అభివృద్ధికి పునాది అన్న విశ్వాసంతో సంస్థ ఈ మహాయజ్ఞాన్ని విస్తృత స్థాయిలో నిర్వహించింది.ఈ కార్యక్రమానికి సహకరించిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, శ్రీనివాస మిత్రులు, రాంపూర్ టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్




అధ్యక్షుడు జి. రామన్న మరియు వారి సహ ఉపాధ్యాయులకు సంస్థ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది.ఈ సేవా కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక చైర్మన్ వూట్కూరి శ్రీనివాస్ రెడ్డి, సభ్యులు ఇజ్జగిరి శ్రీనివాస్, అవధూత శ్రీనివాస్, దూస శ్రీనివాస్, పెద్ది శ్రీనివాస్, చొక్కారపు శ్రీనివాస్, నార్ల శ్రీనివాస్, పైడ శ్రీనివాస్, పడకంటి శ్రీనివాస్, కలికోట శ్రీనివాస్, గట్టు శ్రీనివాస్, గోనె శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.భవిష్యత్తులో మరింత విస్తృతంగా ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టాలని సంస్థ సంకల్పం వ్యక్తం చేసింది.

# ఘనంగా శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి కళ్యాణ మహోత్సవం



**పెద్దపల్లి, ఫిబ్రవరి 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జూలపల్లి మండలం తెలుకుంట గ్రామంలో శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి కళ్యాణ మహోత్సవం, శివాలయంలో కలశ ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమంలో పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణా రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే విజయరమణా రావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఆలయ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# విద్యార్థులు శాంపిల్ స్టడీని సమర్థవంతంగా నిర్వహించాలి



**మహబూబాబాద్, ఫిబ్రవరి 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఎస్‌సీఈఆర్‌టీఆదేశాల మేరకు జిల్లాలోని ప్రాథమిక పాఠశాలల్లో చదువుతున్న రెండవ తరగతి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల పరిశీలన కోసం ఎంపికైన బీఈడీ విద్యార్థులకు ఎఫ్‌ఎల్‌ఎన్ (ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమెరసీ) పై రెండు రోజుల శిక్షణ కార్యక్రమం స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో ప్రారంభమైంది. ఈ శిక్షణలో ఎంపికైన 53 మంది ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లు పాల్గొన్నారు. ఈనెల 25, 26, 27 తేదీలలో ఎంపిక చేసిన ప్రాథమిక పాఠశాలల్లో రెండవ తరగతి విద్యార్థులపై ఎఫ్‌ఎల్‌ఎన్ శాంపిల్ స్టడీ నిర్వహించబడుతుంది. ఈ సర్వేలో విద్యార్థుల నైపుణ్యాలు, అభ్యసన సామర్థ్యాలు పరిశీలించబడతాయి. జిల్లా విద్యాశాఖ అధికారి రాజేశ్వర్ మాట్లాడుతూ, “విద్యార్థులు శాంపిల్ స్టడీని సమర్థవంతంగా నిర్వహించాలి. ఆర్పీలు ఇచ్చే సూచనలను జాగ్రత్తగా పాటిస్తూ, ఫలితాలను సమయానికి అప్‌లోడ్ చేయాలి” అని సూచించారు. ఈ కార్యక్రమానికి కోర్స్ కోఆర్డినేటర్‌గా జిల్లా సైన్స్ ఆఫీసర్ బి. అప్పారావు, ఆర్పీలుగా ప్రవీణ్, యాదగిరి వ్యవహరించారు. రాష్ట్రస్థాయి పరిశీలకుడు సురేందర్ శిక్షణా కార్యక్రమాన్ని పరిశీలించి విద్యార్థులకు తగిన సూచనలు అందించారు.

# వెన్నం కుటుంబానికి ముఖ్యమంత్రి పరామర్శ

**మహబూబాబాద్, ఫిబ్రవరి 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జిల్లా రెడ్యాలలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దివంగత నేత వెన్నం రాఘవేందర్ రెడ్డి చిత్రపటానికి పుష్పగుచ్చాలు ఉంచి నివాళు లర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం నూరిపోశారు. ముఖ్యమంత్రితో పాటు మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎంపీ బలరాం నాయక్, ప్రభుత్వ విప్ డాక్టర్ రామచంద్రు నాయక్, ఎమ్మెల్యే మురళీ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



# ఎస్సీ హాస్టల్ ను తనిఖీ చేసిన మున్సిపల్ చైర్మన్ పత్య నాయక్




**ఆమనగల్లు, ఫిబ్రవరి 22(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఆమనగల్లు మండలంలోని ఎస్సీ హాస్టల్ ను 9వ వార్డు కౌన్సిలర్ ఎర్రవోలు మహేష్ తో కలిసి మునిసిపల్ చైర్మన్ పత్య నాయక్ తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి నాణ్యమైన భోజనం అందిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. వార్డెన్ తో మాట్లాడి మెనూ ప్రకారం విద్యార్థులకు మంచి నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆనంద్, పూసలి సత్యం, శ్రీను నాయక్, రాజేందర్ నాయక్ ,తదితరులు పాల్గొన్నారు.


# అవిముక్తేశ్వరానంద సరస్వతిపై పోక్సో

-- యుపి ప్రత్యేక కోర్టు ఆదేశం
-- మైనర్ బాలికలపై స్వామి అత్యాచారయత్నం



**న్యూఢిల్లీ ఫిబ్రవరి 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఉత్తరప్రదేశ్‌కు చెందిన ప్రముఖ స్వామి అవిముక్తేశ్వరానంద సరస్వతిపై పోక్సో కేసు నమోదు చేయాలని ప్రయాగ్‌రాజ్ ప్రత్యేక కోర్టు యుపి పోలీసులను ఆదేశించింది. గత నెలలో ప్రయాగ్‌రాజ్‌లో జరిగిన మాఘ మేళా సందర్భంగా నిందితుడు తమపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారని ఇద్దరు బాలికలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మతపరమైన సేవ, ఆధ్యాత్మిక మార్గదర్శకత్వం అందిస్తున్నట్లు నటిస్తూ సరస్వతి ఈ చర్యలకు పాల్పడ్డారని వారు పోలీసులకు తెలిపారు. అయితే పోలీసులు కేసు నమోదు చేయలేదు. దీంతో బాధితులు కోర్టును ఆశ్రయించారు. దీనిపై పోక్సో కోర్టు అదనపు సెషన్స్ జడ్జి వినోద్ కుమార్ చౌరాసియా విచారించారు. చట్టంలోని నిబంధనలకు అనుగుణంగా నిష్పక్షపాతంగా, స్వతంత్రంగా దర్యాప్తు జరపాలని, బాధితుల గౌరవాన్ని కాపాడాలని పోలీసులను ఆదేశించారు. మాఘ మేళా అనేది ఏటా జరిగే జాతర. ఇందులో గంగా, యమునా, సరస్వతి నదుల త్రివేణి సంగమంలో పవిత్ర స్నానం చేయడానికి యాత్రికులు అధిక సంఖ్యలో హాజరవుతారు. ఆ సమయంలో వందలాది మంది సాధువులు, మత పెద్దలు సంగం వద్ద తమ శిబిరాలను ఏర్పాటు చేసుకుంటారు. ఈ సందర్భంగా ఆయన ఆశ్రమంలో 14, 17 ఏళ్ల వయసు గల ఇద్దరు మైనర్లపై అత్యాచారయత్నం జరిగిందనే విషయం వెలుగులోకి వచ్చింది. అయితే ‘గురు సేవ’ పేరుతో మైనర్లపై అత్యాచారానికి పాల్పడిన స్వామిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని శాకుంభరీ పీఠాధీశ్వర్ అశుతోష్ బ్రహ్మచారి మహారాజ్ పిటిషన్ దాఖలు చేశారు.


# భారత్-అమెరికా వాణిజ్య ఒప్పంద చర్చలు వాయిదా




**న్యూఢిల్లీ ఫిబ్రవరి 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
భారతదేశం-అమెరికా మధ్య తాత్కాలిక వాణిజ్య ఒప్పందాన్ని ఖరారు చేయడానికి ఫిబ్రవరి 23న వాషింగ్టన్‌లో ప్రారంభం కావాల్సిన చర్చలు వాయిదా పడ్డాయి. ఒప్పందంలో భాగంగా జరగాల్సిన ప్రధాన సంధానకర్తల కీలకమైన సమావేశం సోమవారం ప్రారంభం కావాల్సి ఉంది. ట్రంప్‌కు వ్యతిరేకంగా అమెరికా సుప్రీంకోర్టు చారిత్రాత్మక తీర్పు మరియు తరువాత ప్రకటించిన కొత్త పన్ను విధానాలు అనిశ్చితిని పెంచాయి. దీంతో సమావేశం వాయిదా పడింది. దర్పన్ జైన్ నేతృత్వంలోని భారత ప్రతినిధి బృందం, అమెరికా వాణిజ్య ప్రతినిధి జామిసన్ గ్రీర్ మరియు అతని బృందం సమావేశం కావాల్సి ఉంది. ఫిబ్రవరి 20న, ట్రంప్ పరిపాలన విధించిన దిగుమతి పన్నులు రాజ్యాంగ విరుద్ధమని అమెరికా సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. దీని తర్వాత, ఫిబ్రవరి 24 నుండి అన్ని దేశాలపై కొత్తగా 10% పన్ను విధిస్తామని ట్రంప్ ప్రకటించాడు. మరుసటి రోజు దానిని 15%కి పెంచుతున్నట్లు ప్రకటించారు. ఈ కొత్త పరిస్థితులు ఆర్థిక వ్యవస్థను ఎలా ప్రభావితం చేస్తాయో అస్పష్టంగా ఉంది. విదేశాల నుండి దిగుమతి చేసుకున్న వస్తువులపై విస్తృత సుంకాలు విధించే అధికారాన్ని అమెరికా సుప్రీంకోర్టు కొట్టివేసినప్పటికీ, భారతదేశంతో వాణిజ్య ఒప్పందంలో మార్పు ఉండదని ట్రంప్ అన్నారు. ఒప్పందం ప్రకారం భారతదేశం నుండి వచ్చే వస్తువులపై విధించిన 18 శాతం సుంకం కొనసాగుతుందని కూడా ఆయన పునరుద్ఘాటించారు.

# ఉగ్ర సంస్థలతో లింకులు.. పేలుళ్లకు కుట్ర..

తమిళనాడు, బెంగాల్‌లో 8 మంది అరెస్ట్



**న్యూఢిల్లీ ఫిబ్రవరి 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
విదేశీ ఉగ్రవాద సంస్థలతో సంబంధాలు కలిగి, మన దేశంలో ఉగ్రదాడులకు కుట్ర పన్నిన ఒక ముఠాను ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తమిళనాడు, పశ్చిమ బెంగాల్‌లో ఎనిమిది మంది ఉగ్ర ముఠాను అరెస్టు చేశారు. అరెస్టైన ఉగ్ర నిందితులకు పాకిస్తాన్‌కు చెందిన లష్కరే తొయిబా సంస్థతో, పాక్ స్పై ఏజెన్సీ ఐఎస్ఐతోపాటు బంగ్లాదేశ్‌కు చెందిన మరో ఉగ్రవాద సంస్తతో సంబంధాలున్నాయి. విదేశీ సంస్థల ఆదేశాల మేరకు నిందితులు త్వరలో దేశంలోని ప్రధాన నగరాల్లో ఉగ్రదాడులకు ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది. ఇంటెలిజెన్స్ నుంచి అందిన సమాచారంతో ఢిల్లీ పోలీసులు స్థానిక పోలీసుల సహకారంతో ఏకకాలంలో తమిళనాడు, పశ్చిమ బెంగాల్‌లో దాడులు నిర్వహించారు. నిందితుల్ని మిజానూర్ రహమాన్, మొహమ్మద్ షాబత్, ఉమర్, మొహమ్మద్ లిటన్, మొహమ్మద్ షాహిద్, మొహమ్మద్ ఉజ్జల్‌గా గుర్తించారు. వీరిలో ఆరుగురు తమిళనాడులోని తిరుప్పూర్ జిల్లాకు చెందిన వాళ్లు కాగా, ఇద్దరు బెంగాల్‌కు చెందిన వాళ్లు. అరెస్టైన వారిలో బంగ్లాదేశీయులు కూడా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. వీరు అక్రమ ఆధార్ కార్డులు కలిగి ఉన్నట్లు ప్రాథమికంగా తేలింది. నిందితుల మొబైల్ ఫోన్లలో ఢిల్లీలో బ్లాస్ట్ చేయవలసిన ప్రదేశాలకు సంబంధించిన వీడియోలున్నాయి. అందులో ఢిల్లీ మెట్రో కూడా ఉంది. వీరి వద్ద నుంచి 8 మొబైల్ ఫోన్లు, 16 సిమ్ కార్డులను స్వాధీనం చేసుకున్నారు. అరెస్టైన నిందితులు సాధారణ వ్యక్తుల్లాగా ఒక గార్మెంట్ ఫ్యాక్టరీలో పని చేస్తున్నారు. వీరికి కాశ్మీర్‌కు చెందిన ఒక తీవ్రవాది సూచనలిస్తున్నట్లు తేలింది. అతడు లష్కరే తొయిబా సంస్థకు చెందిన వాడు. కానీ, ప్రస్తుతం బంగ్లాదేశ్ నుంచి ఈ ముఠాను నడిపిస్తున్నాడు. అతడు ఇంతకుముందు పాకిస్తాన్‌లో ట్రైనింగ్ తీసుకున్నాడు. ప్రజలన మతం పేరుతో రెచ్చగొట్టే విధంగా, ఫ్రీ కాశ్మీర్ అంటూ రూపొందించిన పోస్టర్ల గురించి విచారిస్తుండగా ఈ ముఠా వ్యవహారం బయటపడింది.

# గిరిజన ఆశ్రమ పాఠశాలలో పకడ్బందీగా విద్యా ప్రణాళిక అమలు



**మహబూబాబాద్, ఫిబ్రవరి 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రాష్ట్రవ్యాప్తంగా గిరిజన ఆశ్రమ వసతి గృహాలు, పాఠశాలల్లో విద్యా వ్యవస్థను బలోపేతం చేస్తూ, నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం విప్లవాత్మక మార్పులు తీసుకొస్తోంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డిజిటల్ తరగతులు, ప్రత్యేక డైట్ మెనూ ద్వారా విద్యార్థుల ఆరోగ్యం, విద్యపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. మహబూబాబాద్ మండలం రెడ్యాల గ్రామంలోని గిరిజన ఆశ్రమ బాలుర పాఠశాలను జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి గుగులోత్ దేశీ రామ్ నాయక్ స్వయంగా పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి అందుతున్న సౌకర్యాలపై వివరాలు తెలుసుకొని, వారితో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ ఆదేశాల మేరకు 19 గిరిజన ఆశ్రమ పాఠశాలలు, 6 వసతి గృహాలు, 9 పోస్ట్ మెట్రిక్ హాస్టల్స్, 104 ప్రైమరీ స్కూల్స్‌లో మొత్తం 7044 మంది విద్యార్థులకు పకడ్బందీగా విద్యా ప్రణాళిక అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రతి నాలుగు హాస్టళ్లకు ఒక ప్రత్యేక అధికారి, అసిస్టెంట్ ట్రైబల్ వెల్ఫేర్ అధికారులు, పిఎమ్ఆర్సిలు, ఏసీఎంఓలు, జిసిడిఓలు, స్పోర్ట్స్ అధికారులు నియమించి, ఉదయం--సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారని చెప్పారు. విద్యార్థులకు మానసిక ఒత్తిడి లేకుండా హ్లాదకరమైన వాతావరణంలో విద్యను అందిస్తున్నామని వివరించారు. ప్రతి నిత్యం అదనపు కలెక్టర్లు, జిల్లా స్థాయి అధికారులు, మండల స్థాయి అధికారులు తనిఖీలు నిర్వహిస్తూ అత్యుత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక గెజిటెడ్ హెడ్‌మాస్టర్ బానోతు శుక్రు నాయక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# పిల్లల సోషల్ మీడియా వాడకం నిషేధంపై సిద్ధమవుతున్న కర్ణాటక

**న్యూఢిల్లీ ఫిబ్రవరి 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** చిన్న పిల్లలు, యువత సోషల్ మీడియాను వాడటం వల్ల చాలా సమస్యల్ని ఎదుర్కొంటున్నారు. ఇది వారిపై దుష్ప్రభావాన్ని చూపిస్తుంది. అందుకే పిల్లలు, టీనేజ్ యువత సోషల్ మీడియా వాడకంపై పరిమితులు, నిషేధం విధించాలని నిపుణులు సూచిస్తున్నారు. ఈ నేపథ్యంలో కర్ణాటక ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకోనుంది. 16 ఏళ్లలోపు వారు మొబైల్ ఫోన్లు, సోషల్ మీడియా వాడకంపై నిషేధం, ఆంక్షలు విధించాలని సిద్ధరామయ్య ప్రభుత్వం భావిస్తోంది.ప్రభుత్వ యూనివర్సిటీల్లో 16 ఏళ్లలోపు విద్యార్థులు మొబైల్ వాడకుండా చూడాలని ప్రభుత్వం నిర్ణయించింది. క్యాంపస్ పరిసరాల్లో వీటి వాడకాన్ని నిషేధించడం



లేదా ఆంక్షలు విధించడం చేయాలనుకుంటోంది. ఈ మేరకు దీన్ని అమలు చేసే అంశంపై యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్లను సంప్రదిస్తోంది. వారి నుంచి వచ్చే సూచనల్ని బట్టి దీనిపై నిర్ణయం తీసుకుంటారు. సీఎం సిద్ధరామయ్య ఈ అంశంపై మాట్లాడుతూ విద్యార్థులు, యువత సోషల్ మీడియా ఎక్కువగా వాడుతూ చెడు ప్రభావానికి గురవుతున్నారన్నారు. వారి ప్రవర్తనలో మార్పులు, మానసిక ఇబ్బందులు, చదువులో వెనుకబడిపోవడం వంటివి ఎదుర్కొంటున్నట్లు చెప్పారు. అలాగే ఈ ప్రభావంతో డ్రగ్స్‌కు, సోషల్ మీడియాకు కూడా బానిసలవుతున్నారని పేర్కొన్నారు. ఆస్ట్రేలియా వంటి దేశాల్లో ఉన్నట్లుగానే ఇక్కడ కూడా విద్యార్థులపై ఆంక్షలు విధించే అంశంలో అభిప్రాయాలు చెప్పాలని వీసీలను సీఎం కోరారు. విద్యా సంబంధ అంశాల్లో మొబైల్ వాడకంపై మినహాయింపు ఇస్తూనే, ఆంక్షలు విధించే అంశంపై సూచనల్ని అడిగారు. ఇదే తరహా ప్రతిపాదన ఇప్పటికే ఏపీ ప్రభుత్వం కూడా చేసింది. సోషల్ మీడియా వాడకంపై వయసు ఆధారంగా పిల్లలకు పరిమితులు విధించాలని ప్రభుత్వం భావిస్తోంది.

# జమ్మూ-కాశ్మీర్‌లో ఆర్మీ ఆపరేషన్..

**-- ఇద్దరు ఉగ్రవాదులు హతం.. ఏకే-47 రైఫిల్స్ స్వాధీనం**

**న్యూఢిల్లీ ఫిబ్రవరి 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జమ్మూ-కాశ్మీర్‌లోని కిష్త్వార్ జిల్లాలో ఆదివారం ఉదయం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు ఉగ్రవాదులు హతమయ్యారు. తీవ్రవాదుల నుంచి రెండు ఏకే-47 రైఫిళ్లను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. జమ్మూ-కాశ్మీర్‌లోని కిష్త్వార్ జిల్లా ప్రాంతంలో ఇద్దరు ఉగ్రవాదులు ఉన్నట్లు ఇంటెలిజెన్స్ నుంచి సమాచారం అందింది. దీంతో 'ఆపరేషన్ ట్రాష్-ఐ' పేరుతో భారత భద్రతా బలగాలు వేట మొదలుపెట్టాయి.దీనిలో భాగంగా ఇక్కడి చాత్రూ ప్రాంతంలో దాక్కున్న ఉగ్రవాదుల కోసం జమ్మూ-



కాశ్మీర్ పోలీసులు, సీఆర్‌పీఎఫ్, ఐబీ దళాలు కలిసి సంయుక్తంగా ఆపరేషన్ ప్రారంభించాయి. మంచుతో నిండిన ఈ అటవీ ప్రాంతాన్ని బలగాలు చుట్టుముట్టాయి. పర్వత ప్రాంతంలోని ఒక మట్టి ఇంటిలో దాక్కున్న ఉగ్రవాదుల్ని ఉదయం 11 గంటల సమయంలో గుర్తించారు. ఈ క్రమంలో ఉగ్రవాదులు.. మన బలగాలపై కాల్పులు జరిపారు. దీంతో మన బలగాలు ఎదురు కాల్పులు ప్రారంభించాయి. కొంతసేపటి తర్వాత కాల్పుల్లో ఇద్దరు ఉగ్రవాదులు హతమయ్యారు. ఉగ్రవాదుల స్థావరం నుంచి రెండు ఏకే-47 తుపాకులు, అలాగే కొంత యుద్ధ సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఈ ప్రాంతంలో ఇంకా సోదాలు కొనసాగుతున్నాయి. ఇక.. చాత్రూ ప్రాంతంలో ఇటీవల ఉగ్రవాదుల కార్యకలాపాలు ఎక్కువయ్యాయి. గత నెలలో ఆరుకుపైగా ఎన్‌కౌంటర్లు జరిగాయి. లష్కరే తొయిబా దేశంలో దాడులకు కుట్ర పన్నిందన్న సమాచారం నేపథ్యంలో భారత భద్రతా దళాలు మరింత అప్రమత్తమయ్యాయి. ఈ నేపథ్యంలో భద్రతను కట్టుదిట్టం చేసి, తనిఖీలు నిర్వహిస్తున్నారు.

## మన ఆ రెండు ఆవిష్కరణలు

# ప్రపంచ నేతలను ఆశ్చర్యపర్చాయి

**న్యూఢిల్లీ ఫిబ్రవరి 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** న్యూఢిల్లీ లోని భారత్ మండపంలో ఇటీవల ముగిసిన 'ఏఐ ఇంపాక్ట్ సదస్సు పై ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రశంసలు కురిపించారు. దీని ద్వారా కృత్రిమమేథ రంగంలో భారతదేశ అద్భుతమైన సామర్థ్యాలను ప్రపంచానికి చూపించామని అన్నారు. ఆదివారం 'మన్ కీ బాత్ 131వ ఎపిసోడ్‌లో దేశ ప్రజలను ఉద్దేశించి ప్రధాని మాట్లాడారు.భారత ప్రభుత్వం విజయవంతంగా నిర్వహించిన ఈ సదస్సు ప్రపంచ దేశాలను ఆకర్షించిందని ప్రధాని చెప్పారు. ఈ సదస్సులో ముఖ్యంగా మన రెండు ఆవిష్కరణలు ప్రపంచ నేతలను ఆశ్చర్యపరిచాయని తెలిపారు. జంతువుల చికిత్స కోసం వాటిని ట్రాక్ చేయడానికి 'ఏఐ'ని ఉపయోగించడం, భారత పురాతన గ్రంథాలు, జ్ఞానాన్ని సంరక్షించడానికి



ఏఐని ఉపయోగించడం చూసి ప్రపంచ నేతలు ప్రశంసించారని అన్నారు. నాయకులు, పారిశ్రామికవేత్తలు, ఆవిష్కర్తలు, స్టార్టప్ రంగాలకు చెందిన వారు ఈ సదస్సుకు హాజరయ్యారని ప్రధాని తెలిపారు. కృత్రిమ మేథ, అంతరిక్ష పరిశోధన, సెమీ కండక్టర్‌లు, గ్రీన్ ఎనర్జీ సహా అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానాలను వినియోగిస్తూ భారత్ వేగవంతంగా అభివృద్ధి చెందుతోందని అన్నారు. మన యువత ఆవిష్కరణలతో దేశకీర్తిని ఉన్నత శిఖరాలకు తీసుకువెళ్లే శక్తిని కలిగి ఉందని చెప్పారు. ఈ సదస్సు ద్వారా మన యువత ప్రతిభను ప్రపంచానికి చూపించగలిగామని ప్రధాని అన్నారు. సైబర్ నేరాలపై ప్రధాని మోదీ హెచ్చరించారు. డిజిటల్ అరెస్టులపట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు. అదేవిధంగా ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కేరళకు చెందిన 10 నెలల చిన్నారి అలిన్ షెరిన్ అవయవదానానికి ముందుకు వచ్చిన తల్లిదండ్రులను ప్రధాని ప్రశంసించారు. బిడ్డను కోల్పోయిన బాధలోనూ వారు తీసుకున్న నిర్ణయం అభినందనీయమన్నారు.

# ఇరాన్‌లో కదంతొక్కిన విద్యార్థులు..


**-ప్రభుత్వానికి వ్యతిరేకంగా భారీ నిరసన**

**న్యూఢిల్లీ ఫిబ్రవరి 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఇరాన్‌లో ఆందోళనలు ఇంకా చల్లారడం లేదు. ఇప్పటికీ నిరసనలు కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా ఇరాన్‌లో వివిధ యూనివర్సిటీలకు చెందిన విద్యార్థులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా కదం తొక్కారు. ప్రభుత్వాధినేత ఖమేనీకి, అతడి పాలనకు వ్యతిరేకంగా శనివారం నినదించారు. ఇరాన్ రాజధాని టెహ్రాన్, మషాద్ పట్టణాల్లో విద్యార్థులు, యువత వీధుల్లోకి చేరి నిరసనలు చేపట్టారు.సుప్రీం లీడర్ ఖమేనీని అంతం చేయాలని, అతడి పాలన నుంచి తమకు స్వేచ్ఛ కావాలని, అలాగే ఈ విషయంలో అమెరికా ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని వారు డిమాండ్ చేశారు. స్థానిక షరీఫ్ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీకి చెందిన విద్యార్థులు ఈ ఆందోళనల్లో పాల్గొన్నారు. ఈ



క్రమంలో పోలీసులు, భద్రతా బలగాలపైకి దూసుకెళ్లారు. వారికి వ్యతిరేకంగా ఉద్యమించారు. ఈ ఉద్యమానికి సంబంధించిన వీడియోలు ప్రస్తుతం వైరల్‌గా మారాయి. ఇరాన్‌లో జరుగుతున్న ఆందోళనల్లో వేల మంది మరణించారని అమెరికా సహా అంతర్జాతీయ హక్కుల సంఘాలు ఆరోపించిన సంగతి తెలిసిందే. కానీ, వీటికి ఆధారాలు చూపాలని ఇరాన్ డిమాండ్ చేసింది. అయితే, ఆందోళనల్లో పాల్గొన్న వేలాదిమందిని ఖమేనీ ప్రభుత్వం చంపిందని ప్రచారం జరుగుతోంది. మరోవైపు ఇరాన్‌పై అమెరికా దాడులకు సిద్ధమవుతోంది.అవసరమైతే ఖమేనీని కూడా చంపాలని అమెరికా భావిస్తోంది. ఇరాన్‌పై అమెరికా ఎప్పుడైనా మెరుపు దాడులకు దిగొచ్చని నేరుగా అమెరికా అధికారులే వెల్లడించారు. అమెరికా దాడుల్ని ఎదుర్కోవడానికి ఇరాన్ కూడా సిద్ధమవుతోంది. తమ దగ్గర ఉన్న ఆయుధాల్ని పరీక్షిస్తోంది. సైన్యాన్ని కూడా సిద్ధంగా ఉండాలని ఆదేశించింది. గత ఏడాది డిసెంబర్ నుంచి ఇరాన్‌లో ఆందోళనలు జరుగుతున్న సంగతి తెలిసిందే.

# విద్యార్థినిపై అత్యాచారం.. ఐదుగురు టీచర్లు అరెస్ట్



**భువనేశ్వర్‌ఫిబ్రవరి 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** స్కూల్ టీచర్లు ఒక బాలికను లైంగికంగా వేధించారు. పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డారు. బాధిత విద్యార్థిని కుటుంబం ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఐదుగురు టీచర్లను అరెస్ట్ చేశారు. ఒడిశాలోని కేంద్రపారా జిల్లాలో ఈ సంఘటన జరిగింది. 13 ఏళ్ల బాలిక ఒక ప్రైవేట్ స్కూల్‌లో ఏడో తరగతి చదువుతున్నది. అయితే ఆ స్కూల్‌కు చెందిన ఐదుగురు ఉపాధ్యాయులు చాలా కాలంగా ఆ విద్యార్థిని లైంగికంగా వేధిస్తున్నారు. ఆ బాలికపై పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డారు.కాగా, బాధిత బాలిక ఈ విషయాన్ని తన కుటుంబానికి చెప్పింది. దీంతో ఫిబ్రవరి 19న ఆమె కుటుంబ సభ్యులు చైల్డ్ వెల్ఫేర్ కమిటీని ఆశ్రయించారు. ఆ కమిటీ ప్రాథమికంగా దర్యాప్తు చేసింది. బాలిక ఆరోపణలపై ప్రత్యేక దర్యాప్తు జరుపాలని పోలీసులు, జిల్లా విద్యాశాఖ అధికారిని కూడా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఆదేశించింది.మరోవైపు చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, బాలిక తండ్రి ఫిర్యాదుపై రాజ్‌కనికా పోలీస్ స్టేషన్ అధికారి స్పందించారు. బాధిత బాలిక స్టేట్‌మెంట్ రికార్డ్ చేశారు. వైద్య పరీక్షల తర్వాత లైంగిక దాడిపై కేసు నమోదు చేశారు. నిందితులైన ఐదుగురు టీచర్లను అరెస్ట్ చేసినట్లు పోలీస్ అధికారి తెలిపారు. ఈ సంఘటనపై మరింతగా దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

# ఇరాన్ బోటును అడ్డుకున్న భారత కోస్ట్ గార్డ్..

**-రూ.5 కోట్ల విలువైన సిగరెట్లు స్వాధీనం**



**అహ్మదాబాద్: ఫిబ్రవరి 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఇరాన్ బోటును భారత కోస్ట్ గార్డ్ అడ్డుకున్నది. రూ.5 కోట్ల విలువైన విదేశీ సిగరెట్లను స్వాధీనం చేసుకున్నది. ఆ బోటులో ఉన్న నలుగురు ఇరాన్ పౌరులను అదుపులోకి తీసుకున్నది. గుజరాత్ తీరంలోని అరేబియా సముద్రంలో ఈ సంఘటన జరిగింది. ఫిబ్రవరి 21న ద్వారకాకు పశ్చిమాన సుమారు 115 నాటికల్ మైళ్ల దూరంలో అనుమానాస్పద విదేశీ పడవను భారత కోస్ట్ గార్డ్ సిబ్బంది గుర్తించారు. షిప్‌లో ఆ బోటు వద్దకు చేరుకున్నారు.కాగా, భారత సముద్ర జలాల్లో ఉన్న ఆ బోటు ఇరాన్‌కు చెందినట్లు భారత కోస్ట్ గార్డ్ సిబ్బంది తెలుసుకున్నారు. ఆ బోటులో 200 కార్టన్ల విదేశీ బ్రాండ్ సిగరెట్లు ఉన్నట్లు గుర్తించారు. రూ.5 కోట్ల విలువైన సుమారు లక్ష ప్యాకెట్ల విదేశీ బ్రాండ్ సిగరెట్లను స్వాధీనం చేసుకున్నారు. మరోవైపు ఆ బోటులో ఉన్న నలుగురు ఇరానియన్ సిబ్బందిని అదుపులోకి తీసుకున్నట్లు భారత కోస్ట్ గార్డ్ తెలిపింది. అల్ ముఖ్తార్‌గా గుర్తించిన ఇరాన్ పడవ, అందులో ఉన్న నలుగురు సిబ్బందిని గుజరాత్‌లోని పోర్‌బందర్‌కు తరలించినట్లు వెల్లడించింది. రూ.5 కోట్ల విలువైన విదేశీ బ్రాండ్ సిగరెట్ల అక్రమ రవాణాపై దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొంది.

# నేపాల్‌లో స్వల్ప ప్రకంపనలు



**ఖాట్మాండు ఫిబ్రవరి 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నేపాల్‌లోని కోశి ప్రావిన్స్‌లో స్వల్పంగా భూమి కంపించింది. ఆదివారం ఉదయం 7.31గంటలకు స్వల్ప ప్రకంపనలు వచ్చాయని, వాటి తీవ్రత రిక్టర్‌స్కేలుపై 4.1గా నమోదైనట్లు జాతీయ భూకంప పర్యవేక్షణ మరియు పరిశోధన సంస్థ తెలిపింది. రైతక్ ప్రాంతంలోని శంఖువాసభలో భూకంప కేంద్రం ఉన్నట్లు పేర్కొంది. శంఖువాసభ దేశ రాజధాని ఖాట్మాండుకు 475 కి.మీ దూరంలో ఉంది. పొరుగున ఉన్న తప్లేజంగ్ మరియు భోజ్‌పూర్ జిల్లాల్లో కూడా ప్రకంపనలు వచ్చాయని తెలిపింది. అయితే ప్రాణ, ఆస్తినష్టానికి సంబంధించి ఎటువంటి సమాచారం వెల్లడించలేదు. ఈ ఏడాది ప్రారంభంలో లామ్‌జంగ్ జిల్లాలోని బన్సర్ సమీపంలో 3.9తీవ్రతతో భూకంపం నమోదైన సంగతి తెలిసిందే. ప్రపంచంలోనే అత్యధిక భూంకపాలు సంభవించే దేశాల్లో నేపాల్ 11వ స్థానంలో ఉంది.

# బిజినెస్

## పెట్రోల్ కారు కొంటే మంచిదా?

ఎలక్ట్రిక్ కారు కొంటే మంచిదా? నిపుణుల సూచనలు ఇవే!



కొత్త కారు కొనాలనుకుంటున్నవారికి ఉండే పెద్ద డౌట్ ఏంటంటే.. పెట్రోల్ కారు కొనాలా, లేక ఎలక్ట్రిక్ వాహనం తీసుకోవాలా? ఇంధన ధరలు పెరుగుతుండటం, పర్యావరణంపై అవగాహన పెరగడం వల్ల వినియోగదారులు నిర్ణయం తీసుకునే ముందు రెండింటి మధ్య తేడాలను జాగ్రత్తగా పరిశీలిస్తున్నారు. ఆటో నిపుణుల ప్రకారం.. తక్కువ ప్రారంభ ఖర్చు కోరుకునే వారికి పెట్రోల్ కార్లు ఇప్పటికీ సులభమైన ఎంపికగా ఉన్నాయి. పెట్రోల్ వాహనాల కొనుగోలు ధర సాధారణంగా తక్కువగా ఉండటం, ఎక్కడైనా వెంటనే ఇంధనం నింపుకునే సౌకర్యం ఉండటం ప్రధాన ప్రయోజనాలు. దీర్ఘ ప్రయాణాలు చేసే వారు లేదా చార్జింగ్ మౌలిక వసతులు లేని ప్రాంతాల్లో నివసించే వారికి పెట్రోల్ కార్లు ఇప్పటికీ అనుకూలంగా ఉంటాయని విశ్లేషకులు చెబుతున్నారు. ఇదిలా ఉంటే, ఎలక్ట్రిక్ కార్లు నెమ్మదిగా మార్కెట్‌లో తమ స్థానం బలపరుచుకుంటున్నాయి. ప్రారంభ ధర ఎక్కువగా ఉన్నప్పటికీ, రోజువారీ వినియోగ ఖర్చు చాలా తక్కువగా ఉండటం జుఎల ప్రధాన ఆకర్షణ. ఒక కిలోమీటర్ నడపడానికి అయ్యే ఖర్చు పెట్రోల్ కారుతో పోలిస్తే గణనీయంగా తగ్గుతుంది. అలాగే కాలుష్యం లేకపోవడం, నిర్వహణ ఖర్చులు తక్కువగా ఉండటం వల్ల పట్టణాల్లో ఎక్కువగా ప్రయాణించే వారికి ఇవి ప్రయోజనకరంగా మారుతున్నాయి.అయితే ఛార్జింగ్ సమయం, పబ్లిక్ చార్జింగ్ స్టేషన్ల పరిమిత లభ్యత వంటి అంశాలు ఇంకా కొంతమందిని వెనక్కి తగ్గిస్తున్నాయి. ప్రభుత్వ ప్రోత్సాహకాలు, బ్యాటరీ టెక్నాలజీ మెరుగుదలతో ఈ సమస్యలు క్రమంగా తగ్గుతున్నాయని రంగ నిపుణులు అంటున్నారు. మొత్తంగా చూసుకుంటే, తరచుగా నగర ప్రయాణాలు చేసే వారు, దీర్ఘకాలంలో ఖర్చు ఆదా కోరుకునే వారు ఎలక్ట్రిక్ కార్ల వైపు చూడవచ్చు. ఇక తరచూ లాంగ్ డ్రైవ్‌లు చేసే వారు లేదా తక్కువ బడ్జెట్‌లో వెంటనే వాహనం కావాలనుకునే వారికి పెట్రోల్ కారు ఇప్పటికీ ప్రాయోగిక ఎంపికగా నిలుస్తోంది. కొనుగోలు ముందు వ్యక్తిగత అవసరాలు, వినియోగ తీరు పరిశీలించడం ఉత్తమ నిర్ణయానికి దారి తీస్తుందని నిపుణులు సూచిస్తున్నారు.

## బంగారం, వెండికి బ్రేకులు.. హైదరాబాద్‌లో తులం గోల్డ్ ఎంతంటే

గత వారం రోజుల నుంచి తగ్గుతూ వచ్చిన బంగారం, వెండి ధరలు నిన్న భారీగా పెరిగింది. తులం బంగారం ధర 2 లక్షల రూపాయలకు చేరువలో ఉండగా, వెండి 4 లక్షల వరకు చేరింది. కానీ గత కొన్ని రోజుల నుంచి భారీగా దిగి వస్తోంది. తాజాగా ఫిబ్రవరి 22న బంగారం, వెండి ధరలకు బ్రేకులు పడ్డాయి. 24 క్యారెట్ల 10 గ్రాముల ధర 1,59,280 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,46,000 వద్ద కొనసాగుతోంది. ఇక వెండి విషయానికొస్తే.. కిలో వెండి ధర రూ.2,75,000 వద్ద కొనసాగుతోంది.



**దేశంలోని ప్రధాన నగరాల్లో బంగారం, వెండి ధరలు**

ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,59,430 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,46,150 వద్ద ఉంది. అదే 18 క్యారెట్ల ధర రూ.1,19,610 వద్ద ఉంది.

ముంబైలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,59,280 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,46,000 వద్ద ఉంది. అదే 18 క్యారెట్ల ధర రూ.1,19,460 వద్ద ఉంది.

హైదరాబాద్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,59,280 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,46,000 వద్ద ఉంది. అదే 18 క్యారెట్ల ధర రూ.1,19,460 వద్ద ఉంది.

విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,59,280 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,46,000 వద్ద ఉంది. అదే 18 క్యారెట్ల ధర రూ.1,19,460 వద్ద ఉంది.

చెన్నైలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,60,150 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,46,800 వద్ద ఉంది. అదే 18 క్యారెట్ల ధర రూ.1,25,600 వద్ద ఉంది.

బెంగళూరులో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,59,280 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,46,000 వద్ద ఉంది. అదే 18 క్యారెట్ల ధర రూ.1,19,460 వద్ద ఉంది.

## ఫోక్స్‌వ్యాగన్ మరో కారు

హైదరాబాద్, ఫిబ్రవరి 21

ఫోక్స్‌వ్యాగన్ మరో లగ్జరీ కారును దేశీయ మార్కెట్‌కు పరిచయం చేసింది. ఎస్‌యూవీ విభాగాన్ని మరింత బలోపేతం చేసే ఉద్దేశంలో భాగంగా సంస్థ 'టేరాన్ ఆర్ లైన్' మాడల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ కారు ప్రారంభ ధర రూ.46.99 లక్షలుగా నిర్ణయించింది. ఏడుగురు కూర్చోవడానికి వీలుండే విధంగా డిజైన్ చేసిన ఈ మాడల్ 2.0 లీటర్ల 4-సిలిండర్ టర్బో పెట్రోల్ ఈవీఓ4 ఇంజిన్‌తో రూపొందించింది. కేవలం 7.3 సెకండ్లలో 100 కిలోమీటర్లు ప్రయాణించనున్న ఈ కారు గంటకు 200 కిలోమీటర్లకు పైగా దూసుకుపోనున్నది. పానోరమిక్ సన్‌రూఫ్, రియర్ సన్ షేడ్స్, 15 ఇంచుల ఇన్ఫోటైన్‌మెంట్ స్క్రీన్, ఫుల్-డిజిటల్ కాక్‌పిట్, 9 ఎయిర్‌బ్యాగ్‌లు, 14 అటానమస్ ఫీచర్లతో రూపొందించింది.




# స్పోర్ట్స్

## స్పిన్ వ్యూహానికి శ్రీలంక చిత్తు.. సూపర్ 8లో ఇంగ్లండ్ బోణీ..!

స్వదేశంలో స్పిన్ అస్త్రంతో ప్రత్యర్థులను దెబ్బతీయాలనుకున్న శ్రీలంక(రాతీఅశ్రీఖఅఋ)కు ఇంగ్లండ్(జుఅస్త్రశ్రీఖఅ) పెద్ద షాకిచ్చింది. పల్లెకెల్ స్టేడియంలో విల్ జాక్స్(3-22) తిప్పేయగా.. పవర్ ప్లేలోనే కష్టాల్లో పడిన లంక.. ఏ దశలోనూ కోలుకోలేకపోయింది. 150 పరుగుల ఛేదనలో టాపార్డర్, మిడిలార్డర్ చేతులెత్తేయగా.. కెప్టెన్ దసున్ శనక(30) పోరాడినా సరిపోలేదు. తడబడుతూ సాగిన ఆతిథ్య జట్టు ఇన్నింగ్స్‌కు ఆదిల్ రషీద్(2-13) తెరదించగా.. 51 పరుగుల తేడాతో గెలుపొందిన ఇంగ్లండ్ అదిరే బోణీ కొట్టింది.సొంతగడ్డపై చెలరేగాలనుకున్న శ్రీలంకను ఇంగ్లండ్ స్పిన్ అస్త్రంతో పడగొట్టింది. సూపర్ 8లో లంక నుంచి స్పిన్ ముప్పును ఊహించిన హ్యారీ బ్రూక్ సేన అందుకు తగ్గట్టే సన్నద్ధమైంది. కానీ.. తీరా మైదానంలోకి దిగాక ఫిల్ సాల్ట్(62) ఒక్కడే రాణించగా ప్రత్యర్థికి 150 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. ఫేవరెట్ లంక తమకు కొట్టినపిండి అయిన పల్లెకెలె స్టేడియంలో అలవోకగా గెలుస్తుందని అభిమానులు అనుకున్నారు. కానీ, పవర్ ప్లేలోనే ఇంగ్లండ్ విజయం దిశగా నడిచింది.

**34కే ఐదు వికెట్లు**





డేంజరస్ ఓపెనర్ పథుమ్ నిశాంక(9)ను రెండో ఓవర్లోనే ఔట్ చేసి జోఫ్రా ఆర్చర్(2-20) తొలి బ్రేకివ్వగా.. అక్కడి నుంచి విల్ జాక్స్(3-22)తన స్పిన్ మ్యాజిక్ చూపించాడు. రిటర్న్ క్యాచ్‌తో కుశాల్ మెండిస్(4)ను వెనక్కి పంపిన అతడు.. పవన్ రత్ననాయకే(0), దునిత్ వెల్లలాగే(10)లను వెనక్కి పంపి ఆతిథ్య జట్టును కష్టాల్లోకి నెట్టాడు. పవర్ ప్లే చివరి ఓవర్లో రెండు ఫోర్లు బాదిన వెల్లలాగే.. మిడాఫ్‌లో షాట్‌కు యత్నించి బ్రూక్ చేతికి చిక్కడంతో... 34కే లంక ఐదు కీలక వికెట్లు కోల్పోయింది. సగం వికెట్లు పడిన వేళ కెప్టెన్ దసున్ శనక(30)తో కలిసి జట్టును ఆదుకోవాలనుకున్న కమిందు మెండిస్(13).. డాసన్ వేసిన 9వ ఓవర్లో సిక్సర్ బాదాడు. కానీ, బంతికి రిటర్న్ క్యాచ్ ఇచ్చి లంక కష్టాలను మరింత పెంచాడు. శనకకు తోడుగా నిలిచే వారు కరువయ్యారు. ఓవర్టన్ ఓవర్లో హేమంత అనూహ్యంగా బ్యాట్‌ను వికెట్లకు తాకించి వెనుదిరిగాడు. అప్పటికే అవసరమైన నెట్‌రన్ రేటు పది దాటడంతో.. పెద్ద షాట్లు ఆడే క్రమంలో ఆదిల్ రషీద్(2-11) ఓవర్లో శనక వికెట్ ఇచ్చేశాడు. అతడు ఔటయ్యాక 13 పరుగులకే శ్రీలంక ఇన్నింగ్స్‌కు రషీద్ తెరదించాడు. ఆల్‌రౌండ్ షోతో ఆతిథ్య జట్టుకు చెక్ పెట్టిని ఇంగ్లండ్ 51 పరుగులతో గెలుపొంది.. గ్రూప్ బీలో బోణీ కొట్టింది.

**సాల్ట్ ఒక్కడే**

సూపర్ 8 తొలి పోరులో ఇంగ్లండ్ ఆరంభంలో తడబడినా పోరాడగలిగే స్కోర్ చేసింది. శ్రీలంక స్పిన్నర్లు దునిత్ వెల్లలాగే(3-26), థీక్షణల(2-21)లు అద్భుతంగా కట్టడి చేయడంతో టాపార్డర్, మిడిలార్డర్ తేలిపోయింది. ఓవైపు వికెట్లు పడుతున్నా ఓపెనర్ ఫిల్ సాల్ట్(62) ఒత్తిడిలోనూ అర్ధ శతకంతో మెరిశాడు. ఆఖర్లో విల్ జాక్స్(13), జేమీ ఓవర్టన్(10 నాటౌట్)లు దూకుడుగా ఆడడంతో ఇంగ్లండ్ నిర్ణీత ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 150 పరుగులు చేసింది.

## భారత్ ఓటమి

**హోబర్ట్**

ఎఫ్ఐహెచ్ ప్రో లీగ్‌లో భారత హాకీ జట్టు వరుస ఓటముల ప్రస్థానం కొనసాగుతున్నది. ఆదివారం ఆఖరి వరకు హోరాహోరీగా సాగిన పోరులో ఆస్ట్రేలియా 5-4తో(పెనాల్టీ షూటౌట్) భారత్‌పై ఉత్కంఠ విజయం సాధించింది. నిర్ణీత సమయంలో ఇరు జట్ల స్కోర్లు 2-2తో సమయ్యాయి. గత మ్యాచ్‌లతో పోల్చుకుంటే ఆసీస్‌తో పోరులో టీమ్ఇండియా మెరుగైన పోరాట పటిమ కనబరిచింది.భారత్ తరఫున అమిత్ రోహిదాస్(15ని), జుగ్‌రాజ్‌సింగ్(43ని) చెరో గోల్ చేయగా, జోయల్ రింటాల(47ని, 56ని) ఆసీస్‌కు డబుల్ గోల్స్ అందించాడు. అయితే విజేతను నిర్ణయించేందుకు అనివార్యమైన పెనాల్టీ షూటౌట్‌లో భారత్‌పై ఆసీస్‌దే పైచేయి అయ్యింది. ఈ మ్యాచ్‌కు ముందు ఎఫ్ఐహెచ్ ప్రో లీగ్‌లో టీమ్ఇండియా వరుసగా ఐదు మ్యాచ్‌ల్లో పరాజయం పాలైంది.



## భళా అమ్మాయిలు.. ఆసియా కప్ కొల్లగొట్టిన టీమిండియా..!

అంతర్జాతీయ క్రికెట్‌లో భారత అమ్మాయిలు వరుసగా ట్రోఫీలు పట్టేస్తున్నారు. నిరుడు హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని టీమిడియా తొలిసారి వన్డే వరల్డ్‌కప్ ఛాంపియన్‌గా అవతరించగా.. రాధా యాదవ్ బృందం మహిళల ఆసియా కప్ రైజింగ్స్ స్టార్స్‌లో విజేతగా నిలిచింది. సెమీఫైనల్లో శ్రీలంకను చిత్తు చేసిన టీమిండియా ఆదివారం జరిగిన ఫైనల్లో బంగ్లాదేశ్‌పై పంజా విసిరింది. ఓపెనర్లు విఫలమైనా తేజల్ హసబ్నిస్(51 నాటౌట్) అర్ధ శతకంతో.. రాధా యాదవ్(38) కెప్టెన్ ఇన్నింగ్స్‌తో మెరవగా.. ప్రేమా రావత్(3-12) ధాటికి బంగ్లా కుప్పకూలింది. 46 పరుగుల తేడాతో ప్రత్యర్థిని మట్టికరిపించిన భారత్ టైటిల్ కొల్లగొట్టింది.సెమీఫైనల్లో భారీ విజయంతో శ్రీలంకను ఇంటికి పంపిన భారత ఏ జట్టు ఫైనల్లోనూ చెలరేగింది. అజేయంగా టైటిల్ పోరుకు దూసుకొచ్చిన బంగ్లాదేశ్‌ను ఆల్‌రౌండ్ షోతో దెబ్బతీసింది. శు భారంభం దక్కకపోయినా తేజల్ హసబ్నిస్(51 నాటౌట్) హాఫ్ సెంచరీతో చెలరేగగా.. రాధా యాదవ్(38) కీలక ఇన్నింగ్స్ ఆడింది. ఐదో వికెట్‌కు వీరు 69 రన్స్ జోడించి పరువు కాపాడారు. 135 పరుగుల ఛేదనలో బంగ్లాదేశ్‌ను భారత బౌలర్లు వణికించారు.





**అటు ప్రేమ.. ఇటు తనూజ**

టీమిండియా నిర్దేశించిన ఛేదనలో బంగ్లాదేశ్ ఏ దశలోనూ లక్ష్యం దిశగా సాగలేదు. ఓపెనర్ ఇష్మా తంజిమ్(3)ను ఔట్ చేసిన సైమా థాకొర్ వికెట్ల వేటకు తెరసింది. షమీమా సుల్తానా(20)ను వెనక్కి పంపిన ప్రేమా రావత్(3-21) ప్రత్యర్థిని మరింత దెబ్బతీసింది. రాధా యాదవ్ ఓవర్లో షర్మీన్ సుల్తానా(18) డగౌట్ చేరగా.. ప్రమాదకరమైన సదియా అక్తర్(10), లతా మొండల్(1)ను ఔట్ చేసిన ప్రేమ మ్యాచ్‌ను భారత్ వైపు తిప్పింది. మరో ఎండ్‌లో తనూజ కన్వర్(2-11) సైతం చెలరేగగా బంగ్లా కోలుకోలేకపోయింది. షోఫియా ఖాతూన్(9)ను తనూజ ఔట్ చేయగా బంగ్లా 88 పరుగులకే ఆలౌటయ్యింది.